


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA

RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 04.12.2025 | సంపుటి : 2 | సంచిక :300 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Thursday | 04.12.2025 | volume : 2 | Issue : 300 | Pages : 8 | Cost : 2/-



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## ఇప్పటికే 60వేల ఉద్యోగాలు భర్తీ చేసాం

### త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

**హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేసేది లేదు**

- తెలంగాణ ఉద్యమ జ్వాలలకు కరీంనగర్ కేంద్రం
- ఎట్టి పరిస్థితుల్లోనూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఏమయ్యిందో చూశాం
- సమర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి
- హుస్నాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి

02

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

# తెలంగాణ రైజింగ్‌కు రండి

## ప్రధాని మోడీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వానం

**రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు ఇన్విటేషన్**

**భట్టితో కలసి ఆహ్వానించిన సిఎం రేవంత్ రెడ్డి**

**దేవుళ్లపై వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం**



దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు.

న్యూఢిల్లీ, రాజముద్ర న్యూస్: తులంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్– బెంగళూరు–చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని

-మిగతా 2 లో..



## అడ్డూ అదుపులేని వెండి ధరలు

**వేలల్లో పెరుగుతూ బంగారానికి సవాల్**

రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిక

04



## వలసలపై ఆంక్షలు.. ఆ దేశాలకే నష్టం

విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

10

# భూ భారతిని సమగ్రంగా తయారు చేశాం

- భూదార్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- ప్రజలు మెచ్చే విధంగా భూభారతి చట్టం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి

భూదార్ కార్డులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూ భారతిలో నియమ నిబంధనలు కఠినతరం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి కోర్టుకు వెళ్లకుండా భూ భారతిని సమగ్రంగా తయారు చేశామన్నారు.



హైదరాబాద్, రాజముద్ర న్యూస్ : 9 లక్షల ఫిర్యాదుల్లో న్యాయపర మైనవి పరిష్కరించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలోని ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామని తెలిపారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధం చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడి ఇందుకు సంబంధించిన వివరాలు

-మిగతా 2 లో..

# రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు**

క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' హిల్ట్ పాలసీని తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ ఉందని ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.



న్యూఢిల్లీ, రాజముద్ర న్యూస్: తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుం డా పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూరుస్తోందని విమర్శించారు. పారిశ్రామిక వేత్తలకు ఒక విధానం.. రైతులకు ఒక విధానమా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా అవినీతి జీవోను తెచ్చారన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అనుమతిస్తే ట్రాఫిక్ పరిస్థితి ఏంటని నిలదీశారు.




# కోకాపేట భూములకు మూడో విడత వేలం

## కాసులు కురిపిస్తున్న కోకాపేట భూములు

**హెచ్ఎండీఏకు రూ.వెయ్యి కోట్ల ఆదాయం**

హైదరాబాద్, రాజముద్ర న్యూస్: కోకాపేట నియోపొలిస్ భూములకు మూడో విడత వేలం ప్రక్రియ ముగిసింది. ఇవాళ ప్లాట్ నెంబర్ 19, 20లోని 8.04 ఎకరాలకు అధికారులు ఈ–వేలం నిర్వహించారు. ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరం రూ.118 కోట్ల ధర పలికింది. ఇవాళ 8.04 ఎకరాలకు హెచ్ఎండీఏకు రూ. వెయ్యి కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం 3 విడతల్లో ఆరు

-మిగతా 2 లో..

# విద్యార్థుల ఆందోళన కనువిప్పు కావాలి

## ఓయూలో విద్యార్థులకు పాడైన అన్నం

**సిఎం రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు**

మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె అన్నట్లుగా రేవంత్ పాలన తీరు ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే,బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్య వస్థ దుస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఉస్మానియా యూనివ ర్సిటీకి వేయి కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి గారు.. కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేక పోవడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు.



# కోతుల బెడద తొలగించిన వారికే | మా ఓటు

**రేగొండ గ్రామంలో పోస్టర్ వేసిన యువత.. కోతుల బెడద తప్పించే వారికే ఓటేస్తామని హెచ్చరిక**

సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. మరోవైపు ప్రజలు కూడా ప్రధాన సమస్యలపై నిలదీస్తున్నారు. సాధారణంగా సర్పంచ్ అభ్యర్థులు ఓట్లు అడగడానికి వస్తే.. ఎవరైనా తమ ఊరిని అభివృద్ధి చేయాలని అడుగుతారు. విద్యుత్, నీటి కొరత వంటి సమస్యలను పరిష్కారం చేయాలని కోరతారు. అయితే.. రేగొండ మండల ప్రజలు మాత్రం ఓ విచిత్ర కోరిక కోరారు.





# పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

**తెలంగాణకు ఏనాడూ మద్దతు ఇవ్వని పవన్**

**మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్, రాజముద్ర న్యూస్: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రంగా

-మిగతా 2 లో..

## భూదార్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)



వెల్లడించారు. భూదార్ కార్డులు సిద్ధం చేశామని.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అందజేస్తామని చెప్పుకొచ్చారు. రెండో విడతలో 373 నక్షలేని గ్రామాల్లో సర్వే చేస్తామని.. ఎన్నికల తర్వాత భూదార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో కేసీఆర్ హయాంలో తీసుకువచ్చిన ధరణిని బంగాళాఖాతంలో వేశామని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలో ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామన్నారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధంగా ఉన్నాయన్నారు. భూభారతి చట్టంతో రైతులందరికీ మేలు జరుగుతుం దన్నారు. ధరణిని బీఆర్ఎస్ సర్కార్ విదేశీ సంస్థకు అప్పగించిందని చెప్పారు. కాంగ్రెస్ పవర్లోకి వచ్చాక భూ భారతిని కేంద్ర సంస్థకు అప్పగించామన్నారు. భయంకరమైన ధరణి వెబ్ సైట్ ను బంగాళాఖాతంలో పడేశామన్నారు. స్థానిక ఎన్నికల తర్వాత నక్షల్లేని గ్రామాల్లో సర్వేలు చేసి భూధార్ కార్డులిస్తామని తెలిపారు. ధరణి వెబ్ సైట్ తో బీఆర్ఎస్ రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చిందన్నారు.ప్రజలు మెచ్చే భూ భారతి చట్టాన్నితమ ప్రభుత్వంలో తీసుకువచ్చామని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నక్షలేని 5గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామని వివరించారు. ఇవాళ(బుధవారం) తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. 6వేల మంది వీఆర్ఏలను నియమించామని తెలిపారు. 490మంది సర్వేయర్లకు లైసెన్స్‌లు ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి సర్వే యర్లను అలాట్ చేశామని తెలిపారు. రోవర్స్ కొనుగోలు చేసి సర్వేయర్లకు అప్పగి స్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా కుప్ప కూల్చారని..తమ ప్రభుత్వం సరిచేస్తున్నామని వివరించారు. 59 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను అధునాతనంగా నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం





(మొదటిపేజీ తరువాయి)

సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్



అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ దేవుళ్లు, హిందూ సమాజం లాంటిదే కాంగ్రెస్ అని కొత్తగా ఎన్నికైన తమ పార్టీ జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకుడిగా ఎలా పనిచేయాలో తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోవడంతో ఈ విషయాన్ని పెద్దదిగా చేసి వివాదాస్పదం చేస్తోందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని? పలు సారూప్యతలు కలిగిన దేవుళ్లు ఉన్నారని తాను చెప్పానని అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కూడా హిందూ సమాజం లాంటిదేనని అని పోలుస్తూ తాను వ్యాఖ్యానించానని స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పలు కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం పిసిసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో సీఎం మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోడీని కోరాను.. మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధికి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకరించారని తెలిపాం.. అలాగే, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీకి పలు వినతులు చేశాం.. ఆర్ఆర్ఆర్ సౌత్ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రిని కోరామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆహ్వానించారు. అలాగే, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరించిన ఆహ్వాన పత్రికను వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు.

## కోతులను పారదోలే వారే ఓట్ల కోసం రండి

**జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 3 :** ఆ ఊర్లో వానరాల బెడద అధికమవడంతో.. ముందుగా వాటిని తరిమేయాలని సర్పంచ్ అభ్యర్థులను వేడుకుంటున్నారు. కోతులను ఊరి నుంచి దాటించాకే ఓట్ల ప్రచారం కోసం రండి.. లేదంటే ఓట్లు అడగవద్దని బహిరంగంగా పోస్టర్ కూడా వేశారు. ఆ పోస్టర్లో ఇంకా ఏముందంటే.. 'మా ఓటును అమ్మేది లేదు.. కోతులను తరిమి ఓట్లు అడిగేందుకు రండి. ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయొద్దు. వజ్రాయుధం లాంటి ఓటుతో గ్రామీణాభివృద్ధికి బాటలు వేద్దాం. ఊరంతా వానరాల దాడుల్లో గాయాలైన బాధితులే. పత్తి, వరి, మిరప పంటలు.. కోతుల చేష్టలతో ఇంటికి చేరడం లేదు. రేగొండ మండల కేంద్రమైన మా గ్రామంలో పెద్ద సార్లు, పెద్ద పెద్ద లీడర్లు తిరుగుతున్నా.. మా గోడును పట్టించుకునే నాథుడే లేకుండాపోయారు. ఎన్నికల వేళ మా ఇల్లు తొక్కే నాయకుల్లారా.. కోతులను తరిమి ఎన్నికకు ముందే అభివృద్ధికి శ్రీకారం చుట్టి.. మీ చిత్తశుద్ధిని చాటుకోండి.' అని స్థానిక ఇన్‌స్పైర్ యూత్ అసోసియేషన్ తరఫున ఓ పోస్టర్‌లో రాసిపెట్టి అందరికీ కనిపించేలా వీధిలో గోడకు అతికించారు. రేగొండలో గోడకు అతికించిన పోస్టర్ ప్రస్తుతం.. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీన్ని బట్టి ఆ ఊరి ప్రజలు కోతుల ద్వారా ఎంతగా ఇబ్బందులకు గురవుతున్నారో అర్థమవుతోందని నెట్టింట చర్చించుకుంటున్నారు. వారి న్యాయబద్ధమైన కోరికను నెరవేర్చి సర్పంచ్ అభ్యర్థులు చిత్తశుద్ధి చాటుకోవాలని పలువురు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. 193 మండలాల్లోని 4,332 గ్రామ పంచాయతీలు; 38,342 వార్డులకు సంబంధించిన నామినేషన్లను స్వీకరించారు. రెండో విడత నామినేషన్లను బుధవారం పరిశీలిస్తారు. డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈనెల 14న జరగనున్నాయి. ఆరోజు మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.

## ఇప్పటికే 60వేల ఉద్యోగాలు భర్తీ చేసాం

(మొదటిపేజీ తరువాయి)



మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్ల పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం అన్నారు. పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్ లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు. ఎడ్యుకేషన్,ఇరిగేషన్ పై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. నెహ్రూ స్ఫూర్తితోనే మేం ముందుకెళ్తున్నాం. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది. ఆనాడు ఎస్ఆర్ఎస్పీని నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆనాడు కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే దేశానికి సేవలు అందిస్తున్నాయి. రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే. వ్యవసాయం దండగ కాదు..పండగ చేసి నిరూపించాం. లక్షా4 వేల కోట్లు రైతుల కోసం మా ప్రభుత్వం ఖర్చు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సులే కాదు..బస్సు ఓనర్లను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అప్పగించాం. అడిగిన ప్రతీ పేద ఇంటికి రేషన్ కార్డు ఇచ్చాం. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే పశువులకు దాణ పెట్టేవాళు.. మా ప్రభుత్వం వచ్చాక సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లునిర్మిస్తున్నాం. హుస్నాబాద్ లో దేవుళ్లేమైనా పాలించారా?. హుస్నాబాద్లో గౌరెల్లి రిజర్వాయర్ ఎందుకు పూర్తి కాలేదు. పదేండ్లు హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే భాధ్యత నాది. ఆనాడు సిద్దిపేట,సిరిసిల్ల ,గజ్వేల్ నియోజకవర్గాలే అభివృద్ధి అయ్యాయి. ఐటీఐ కాలేజీలన్నింటిని ఏటీసీలుగా మార్చాం. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి నెలనెలా రూ.2వేలు ఇస్తున్నాం. అని రేవంత్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వ్యాఖ్యానించారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని.. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేళ్లు నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలసత్వం ప్రదర్శించారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా వరిని పండించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని సీఎం ప్రకటించారు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 262.78 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ం÷ుఅ ఏర్పాటుతో పాటు రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, రూ. 8.60 కోట్లతో ఖిం యూనిట్ ఆఫీస్ కు శంకుస్థాపన చేశారు. ఇక, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్- కొత్తపల్లి ప్యాకేజీ-1లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్-అక్కన్నపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు తదితరులు సభలో పాల్గొన్నారు..

## కాసులు కురిపిస్తున్న కోకాపేట భూములు

(మొదటిపేజీ తరువాయి)

ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హెచ్ఎండీఏ వేలం వస్తోంది. కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈ-వేలం వేయనుంది.

## పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

(మొదటిపేజీ తరువాయి)

స్పందించారు. ఎల్బీనగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమ బిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసిన కవిత, పవన్ కళ్యాణ్ మాత్రం ఆనాటి నుంచి ఇనాటి వరకు తెలంగాణకు వ్యతిరేకంగానే ఉన్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతో కోనసీమ పాడైందని అనడంపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఏనాడూ దిష్టి పెట్టలేదు. కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలనుకున్నాం. తెలంగాణ బిడ్డల మనసు చాలా గొప్పది, మేము పెద్దగా ఆలోచిస్తాం అని ఆమె అన్నారు. తమ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు అవుతున్నా, ఎప్పుడు కూడా జై తెలంగాణ, జై ఆంధ్రా అనే తాము కోరుకున్నామని, తెలంగాణ ఎంత బాగుందో ఆంధ్రా కూడా అంతే బాగుండాలని ఆకాంక్షించామని ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలని నేను పార్లమెంట్‌లో కూడా మాట్లాడాను. పక్కోడు బాగుంటే మా కళ్లు మండవు. పక్కోనిది గుంజుకోవాలనుకునే వాళ్లం కాదు. మేము బాగుండాలని కోరుకుంటాం కానీ, పక్కోడు చెడిపోవాలని అనుకోం. అలా అనుకొని ఉంటే తెలంగాణ ఉద్యమ స్వరూపం వేరేలా ఉండేది. మా బిడ్డలు ప్రాణాలు త్యాగం చేశారే తప్ప, ఒక్క పరాయి రాష్ట్రం వారి మీద కూడా చేయి ఎత్తలేదని కవిత వివరించారు. ఆనాడు సినిమా నటుడిగా మాట్లాడారు కానీ, ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అని, ఆయన మాటలు ఆంధ్రా ప్రజలకు ఆపాదిస్తారని కవిత హెచ్చరించారు. కనుక పవన్ కళ్యాణ్ జాగ్రత్తగా ఆలోచన చేసి మాట్లాడాలని ఆమె సూచించారు.

## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దురదృష్టకరం

- క్షమాపణలు చెప్పాలన్న మంత్రి అడ్లూరి
- కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు



**జగిత్యాల, డిసెంబర్ 3 :** తెలంగాణ ప్రజలను కించపరుస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పవన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో బుధవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అదేవిధంగా బేతాళస్వామిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొండగట్టులో ఇటీవల జరిగిన ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్య ద్వారానే వారు ఉన్నత స్థానానికి చేరుతారన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ డ్వాక్రా మహిళలను మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రూ.590 కోట్లు వెచ్చించి నిరుపేదలకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యాన్ని అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది తామే అన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు అంకితమని.. దోపిడీదారులకు, దొంగలకు కాదన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచే విధంగా సిఎం రేవంత్ తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.

## ప్రతి లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇల్లు

- ఐదేండ్లలో 17లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- హుస్నాబాద్‌లో బహిరంగ సభలో మంత్రి వివేక్



**సిద్దిపేట, డిసెంబర్ 3 :** ఐదేళ్లలో ప్రతి ఒక్క లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఐదేండ్లలో 17లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. పేదల కోసం రేషన్ కార్డుపై సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్ని ÷ర్ అయ్యారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లుఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్లో కేసీఆర్ కుటుంబ సభ్యులు తమ ఆస్తులు పెంచుకుని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు మంత్రి వివేక్. బీఆర్ఎస్ అప్పులకు నెలకు రూ.5వేల కోట్ల మిత్తీలు కడుతున్నామని చెప్పారు. యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యారంగంపై భారం తగ్గుతుందన్నారు. హుస్నాబాద్ లో అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సర్కార్ చేసిన అభివృద్ధితోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిచిందన్నారు వివేక్. కేటీఆర్ ఒక ఫెయిల్యూర్ లీడర్ అని..ఆయన నాయకత్వంలో పనిచేయాలో లేదో ఆ పార్టీ కార్యకర్తలు తెలుసుకోవాలన్నారు.



## ఆటోలో అనుమానాస్పదంగా ఇద్దరు మృతదేహాలు

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 3 :** నగరంలోని చాంద్రాయణగుట్టలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం కలకలం రేపింది. రోమన్ హోటల్ ఎదురుగా ఉన్న ఓ ఆటోలో ఇద్దరి మృతదేహాలను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతులను జహంగీర్ (24), ఇర్ఫాన్ (25)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకోవడంతోనే వారు మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఘటనాస్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. అక్కడ మూడు సిరంజీలు లభ్యమయ్యాయి. మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ సాయం తో ఆధారాలు సేకరించారు. అక్కడ మూడు సిరం జీలు లభించాయి. దీంతో అధిక మోతాదులోడ్రగ్స్ తీసుకోవడంతోనే వారు చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

## రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

### కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 3 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుటుంబం రాజకీయం చేసిందని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. విలువలు లేని రాజకీయాలు మంచిది కాదు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి ఇంకోసారి మాట్లాడొద్దు. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీ. కేటీఆర్.. ఇక్కడ రాజకీయం చేయి.. సీఎం, పీసీసీ చీఫ్, మేమంతా సిద్ధం. రాహుల్ గాంధీని విమర్శిస్తే విడిచిపెట్టనని జగ్గారెడ్డి అన్నారు.

# ఇక మహానగరంగా హైదరాబాద్

- జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీల విలీనం
- మున్సిపల్ రికార్డులను స్వాధీనం
- సిబ్బంది వివరాలు తెలియచేయాలని సూచనలు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేక ఆదేశాలు జారీ



**హైదరాబాద్, డిసెంబరు 3 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 27 మున్సిపాలిటీల విలీనం పక్రియ వేగవంతం అయింది. ఇప్పటికే ప్రభుత్వం పంపిన ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రత్యేక ఆదేశాలను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో రికార్డులను స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు రికార్డ్స్ స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రత్యేకంగా రికార్డ్స్ ప్రొఫార్మ రూపొందించాలని తెలిపారు. ఇక, 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితాను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్‌లో విలీనం అయ్యే 27 మున్సిపాలిటీలలో ఉన్న సిబ్బంది వివరాలను తక్షణమే అందించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి వివరాలు సమర్పించాల్సిందిగా లేఖ రాశారు. జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల పక్రియ వేగవంతం చేసేందుకు అత్యవసరంగా ఈ డేటాను కోరినట్లు కమిషనర్ లేఖలో స్పష్టం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్-1955లో వచ్చిన తాజా ఆర్డినెన్స్‌ల ఆధారంగా విస్తరణకు అనుమతి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి నుంచి మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ జీహెచ్ఎంసీ పరిధిలో భాగం కానుంది. ఈ మేరకు కోర్ అర్బన్ రీజియన్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. జీహెచ్ఎంసీని ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్‌గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితా విడుదల చేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఢిల్లీ వెళ్లిన డిప్యూటి సిఎం డీకే శివకుమార్

### నాయకత్వ మార్పుపై మళ్లీ ఊహాగానాలు



**బెంగళూరు, డిసెంబరు 3 :** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం నాడు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు వ్యవహారంపై ముందుగా కలిసి చర్చించుకోండంటూ కాంగ్రెస్ అధిష్ఠానం సూచించడంతో ముఖ్యమంత్రి సిద్ధరామ య్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇటీవల పరస్పరం బ్రేక్‌ఫాస్ట్ ఆతిథ్యం ఇచ్చిపుచ్చుకోవడం జరిగాయి. ఇరువురు నేతలూ మీడియా ముందుకు వచ్చి తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ నేపథ్యంలో డీకే శివకు మార్ ఢిల్లీ పర్యటనకు బయలుదేరడం ఆసక్తికరమైంది. అయితే ఇదెలాంటి రాజకీయ పర్యటన కాదని బెంగళూరులో మీడియాకు డీకే తెలిపారు. ఢిల్లీలో ఒక వివాహ కార్యక్ర మానికి హాజరవుతున్నాననీ, రెండు మీటింగ్‌లు కూడా ఉంటాయని డిప్యూటీ సీఎం తెలిపారు. 'ఓట్ చోరీ'పై ఈనెల 14న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న ర్యాలీ ఏర్పాట్లను కూడా తాను చూసుకోవాల్సి ఉందని చెప్పారు. కాగా సీఎం సిద్దారామయ్యతో పాల్గొనాల్సిన ఒక కార్యక్రమం కోసం ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఉదయం మంగళూరు వచ్చారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే మద్దతుదారులు ఈ సందర్భంగా 'డీకే-డీకే' అంటూ నినాదాలు చేశారు. దీనిపై డీకేను మీడియా ప్రశ్నించినప్పుడు, కొందరు మోదీ-మోదీ అంటూ నినాదాలు చేస్తారని, మరికొందరు డీకే-డీకే అని, ఇంకొందరు రాహుల్-రాహుల్ అని, సిద్ధు-సిద్ధు అని నినాదాలు చేస్తుంటారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. జనం తమ ప్రేమాభిమానాలను చాటుకోవడం సహజమేనని తెలిపారు. మంగళూరులో కేసీ వేణుగోపాల్‌తో కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధరామయ్య సైతం.. అధిష్ఠానం పిలిస్తే ఢిల్లీకి వెళ్తానని చెప్పారు.

## బెంగాల్‌లో సర్ సక్రమంగా సాగేలా చూడండి

### బిజెపి ఎంపిలకు మోడీ హితోక్తులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 3 :** పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారని సమాచారం. ఆ పక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుం టోందని ఆరోపణలు చేస్తున్నారు. ఎన్ని కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి తీసుకువచ్చినా.. ఎంత ఖర్చు పెట్టినా తనను రాజకీయపరంగా ఓడించలేరని గతంలో విరుచుకుపడ్డారు. అలాగే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుం డా.. విపక్షాల ట్రాప్‌లో చిక్కవద్దని బెంగాల్ భాజపా ఎంపీలకు హితబోధ చేశారు. అంతేగాకుండా ఆ రాష్ట్రంలో భాజపా ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. 2021లో ఆ సంఖ్య 65కు చేరింది. స్థానిక అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని ఎంపీలతో పేర్కొన్నారు. కాగా.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ స్పందన వచ్చింది.

## ఛత్తీస్‌గడ్‌లో మరో ఎన్‌కౌంటర్

### ఐదుగురు మావోలు.. ఒక పోలీస్ మృతి

**బీజాపూర్, డిసెంబర్ 3 :** అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. కేంద్రహోంశాఖ విధించిన గడువు సమీపిస్తున్న కొద్దీ అరణ్యాలు కాల్పుల మోతతో దద్దరిల్లుతున్నాయి. బుధవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని అడవిలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు, పోలీసుల డిస్టిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) మరణించినట్లు తెలిపారు. మరో జవాన్‌కి గాయాలయ్యాయని అన్నారు. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుండి మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రాష్ట్రపోలీసుల్లోని రెండు విభాగాలైన డిస్టిక్ట్ రిజర్వ్‌గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ మరియు సిఆర్‌పిఎఫ్ ఎలైట్ గ్రూప్ కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిసోల్యూట్ యాక్షన్) ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆ అధికారి తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటి వరకు 268 మంది మావోయిస్టులు మరణించారు.

## సంగారెడ్డి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

**విద్యార్థుల మధ్య పరస్పరం గొడవ**

**సంగారెడ్డి, డిసెంబరు 3 :** సంగారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ ని సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. ఎందుకు ర్యాగింగ్ చేస్తున్నారంటూ సీనియర్స్ పై విద్యార్థి సోదరుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆగ్రహంతో శాంతినగర్ లోని విద్యార్థి ఇంటికి వెళ్లి మరి సీనియర్స్ దాడి చేశారు. దీంతో సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ గ్యాంగ్ వార్ లో ఓ విద్యార్థికి చేయి విరిగగా, మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. అయితే, ఈ గొడవపై పోలీసులకు కాలనీ వాసులు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన సంఘటన ప్రదేశానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణకు కారణమైన వారిని పట్టుకుని సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లారు. ఇక, సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌ను నిరోధించడానికి కాలేజీ యాజమాన్యం యాంటీ-ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీతో పాటు పోలీసులు కూడా ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని తెలిపారు.

## గుండెపోటుతో ఎస్సై మృతి

**హైదరాబాద్, డిసెంబర్ 3 :** హైదరాబాద్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. విధుల్లో ఉన్న ఎస్సై గుండెపోటుతో కుప్పకూలడం తీవ్ర విషాదాన్ని నింపింది. మంగళవారం అర్ధరాత్రి ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై సంజయ్ సావంత్(58) మృతి చెందాడు. సోమవారం రాత్రి నైట్ డ్యూటీలో భాగంగా పోలీస్ స్టేషన్ బ్యారక్ లో ఉన్న సమయంలో.. మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కుప్పకూలాడు. విధుల్లో ఉన్న ఇతర కానిస్టేబుల్స్ వెంటనే ఎస్సైని సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు డిక్లేర్ చేశారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు తోటి పోలీసులు సమాచారం అందించారు. ఎస్సై సంజయ్ గత రెండేళ్లుగా ఎల్బీనగర్ పీఎస్ లో పనిచేస్తున్నారు. 1989లో కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయిన సంజయ్.. ఈ మధ్యే ఎస్సైగా ప్రమోట్ అయ్యి విధులు నిర్వహిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

## లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఎంపిల ఆందోళన

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా బుధవారం ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఇండియా బ్లాక్ ఎంపీలు పాల్గొన్నారు. 'కార్పొరేట్ జంగిల్ రాజ్‌కి నో ? కార్మిక న్యాయానికి ఎస్' అని రాసిన బ్యానర్లు పట్టుకుని ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. కాగా, పార్లమెంటు సమావేశాల రెండో రోజు కూడా ఎస్ఐఆర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో.. కేంద్ర ప్రభుత్వం దీనిపై డిసెంబర్ 9న చర్చించేందుకు ఆమోదించింది. డిసెంబర్ 1 నుంచి 19 వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్నాయి.

## నామినేషన్ల స్వీకరణలో జాగ్రత్తలు : కలెక్టర్

**హన్మకొండ, డిసెంబర్ 3 :** మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శభరీష్ సూచించారు. మూడో విడత పంచాయతీ నామినేషన్ల పక్రియ బుధవారం నుంచి ప్రారంభం కాగా, దామెర మండల కేంద్రంతోపాటు ఓగ్లాస్‌పూర్ క్లస్టర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నామినేషన్ వేసే అభ్యర్థులు సరైన పత్రాలు జత చేసేలా చూడాలన్నారు. ఓటరు జాబితా నామినేషన్ కేంద్రంలో అందుబాటులో ఉంచాలని, ఎటువంటి లోపాలకు తావులేకుండా ఉండాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీఓ కల్పన, ఎంపీవో రంగాచారి, తదితరులు ఉన్నారు.

## సభా హక్కుల ఉల్లంఘనపై గట్టిగా జవాబిస్తా

### కుక్క వ్యవహారంపై రేణుకా చౌదరి ఘాటు స్పందన



**న్యూఢిల్లీ, డిసెంబరు 3 :** కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ రేణుకా చౌదరి తన కారులో ఒక కుక్కను తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి రావడం ఇటీవల సంచలనమైంది. ఎంపీలకు కల్పించిన హక్కులకు ఇది విరుద్ధమని బీజేపీ దీనిపై మండిపడగా, ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టనున్నారనే ప్రచారం జరిగింది. దీనిపై పార్లమెంటు వెలుపల ఆమెను మీడియా బుధవారంనాడు ప్రశ్నించినప్పుడు ఆమె 'బౌ బౌ' అంటూ రియాక్షన్ ఇచ్చారు. 'ఇంతకంటే ఏమి చెప్పాలి? తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు చూద్దాం. సమస్య ఏముంది? అది వచ్చినప్పుడు గట్టి సమాధానమిస్తాను' అని చెప్పారు. పార్లమెంటు సమావేశాల రేణుకా చౌదరి కారులో ఒక శునకాన్ని తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి వచ్చారు. వెంటనే భద్రతా సిబ్బంది ఆ కుక్కను వెనక్కి పంపేశారు. తాను రోడ్డుపై వస్తున్నప్పుడు రెండు వాహనాలు ఢీకొని మధ్యలో కుక్కపిల్ల కనిపించిందని, అది గాయపడి ఉంటుందని భావించి కారులో తీసుకువచ్చానని, ఇక్కడకు వచ్చిన వెంటనే ఆ కుక్కను తన ఇంటికి పంపించేశానని చెప్పారు. ఇందులో సమస్య ఏముందని ప్రశ్నించారు. రేణుకా చౌదరి చర్యను బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ తప్పుపట్టడంతో ఆమె తిరిగి స్పందించారు. కాలుష్యంతో జనం చనిపోతున్నారు. దానిపై ఎవరికీ ఎలాంటి బాధ లేదు. బీఎల్ఓలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ల కుటుంబాలు అతలాకుతలమవుతున్నాయి. అయినా వాళ్లకు ఎలాంటి పట్టింపూ లేదు. కార్మిక చట్టాలు రుద్దుతున్నారు. సంచార్ సాథీ యాప్ బలవంతంగా మనపై రుద్దుతున్నారు. కానీ రేణుకా చౌదరి కుక్క అందరికీ ఆందోళనకరమైన విషయంగా కనిపిస్తోంది. ఇంతకంటే ఏమి చెప్పాలి? మూగజీవాలను నేను ప్రేమిస్తూనే ఉంటాను' అని అన్నారు. పార్లమెంటు ఆవరణలోకి కుక్కలు రాకూడదనే నిషేధం ఏదీ లేదని, అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఒకసారి ఎద్దులబండిపై వచ్చారని గుర్తుచేశారు.

## చెన్నైలో అఖండ-2 ప్రచారంలో బాలయ్య

### తమిళనాడు జన్మభూమి అంటూ వ్యాఖ్య



**చెన్నై, డిసెంబరు 3 :** తన కొత్త సినిమా 'అఖండ 2' ప్రచారంలో భాగంగా ప్రముఖ నటుడు బాలకృష్ణ చెన్నై వెళ్లారు. అక్కడ నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మద్రాస్ తన జన్మభూమి అని చెప్పిన ఆయన.. తెలంగా ణను తన కర్మభూమిగా, ఆంధ్రప్రదేశ్ ఆత్మ భూమిగా పేర్కొన్నారు. మద్రాస్‌లో తాను గడిపిన జీవితాన్ని, తమిళ దివంగత నటు లను గుర్తుచేసుకున్నారు. చిత్రసీమకు వచ్చి 50 ఏళ్లు పూర్తవడం, ఇప్పటికీ హీరోగా కొనసాగుతుండటం గర్వంగా ఉందన్నారు. వరుసగా నాలుగు చిత్రాలు (అఖండ, వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్ హిట్లు కొట్టానని, 'అఖండ 2' ఆ జాబితాలో చేరనుందని నమ్మకంగా చెప్పారు. రొటీన్ చిత్రాల్లో నటించడం ఇష్టం లేదన్నారు. 'అఖండ 2' పాన్ ఇండియా స్థాయిలో డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ముంబయి, చిక్కబళ్లాపుర (కర్ణాటక), హైదరాబాద్, విశాఖపట్నంలో వేడుకలు నిర్వహించిన చిత్ర బృందం.. తాజాగా చెన్నై వెళ్లింది. మరోవైపు, బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన 'అఖండ 2' టీమ్ ఇంట ర్వ్యూ విడుదలైంది. పలు వీడియోలు క్లిప్పింగ్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. హిందీలోనూ బాలకృష్ణ అన్‌స్టాపబుల్ అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. మహా కుంభమేళాలో చేసిన షూటింగ్‌ను దర్శకుడు బోయ పాటి శ్రీను గుర్తుచేసుకున్నారు. కొన్ని సన్నివేశాలు 2 కోట్ల భక్తుల మధ్య దాదాపు 10 గంటలపాటు నీటిలో షూట్ చేశామని తెలిపారు.

## ఇండిగో విమాన సేవల్లో అంతరాయం

- షెడ్యూల్‌ను సర్దుబాటు చేసిన సంస్థ
- అంతరాయంపై ప్రయాణికులకు క్షమాపణలు




**న్యూఢిల్లీ, డిసెంబరు 3 :** దేశవ్యాప్తంగా తమ విమాన సేవల్లో అంతరాయం ఏర్పడటంపై 'ఇండిగో' సంస్థ స్పందించింది. ఈ వ్యవహారంపై ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు రానున్న 48 గంటల పాటు తమ షెడ్యూల్‌లో సర్దుబాట్లు చేయడం ప్రారంభించి నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇందులో భాగంగా కొన్ని విమానాల రద్దు, మరికొన్నింటిని రీషెడ్యూల్ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బుధవారం దేశవ్యాప్తంగా 100కుపైగా 'ఇండిగో' విమానాలు రద్దయినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. 'రెండు రోజులుగా మా విమాన కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు. చిన్నపాటి సాంకేతిక లోపాలు, శీతాకాలానికి సంబంధించిన షెడ్యూల్ మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పెరిగిన రద్దీ, అప్‌డేట్ చేసిన సిబ్బంది రోస్టరింగ్ నియమాల అమలు వంటి కారణాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించేందుకు, పరిస్థితిని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు మా బృందాలు 24 గంటలూ పనిచేస్తున్నాయి. సేవల్లో అంతరాయంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, రీఫండ్ అందించడం వంటివి చేస్తున్నాం' అని సంస్థ తెలిపింది. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థగా గుర్తింపు పొందిన 'ఇండిగో'.. రోజుకు దాదాపు 2,300 విమాన సర్వీసులు నడుపుతుంది. రెండు రోజులుగా సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం 1,400కు పైగా సర్వీసులు ఆలస్యమయ్యాయి. దిల్లీ, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు వంటి విమానాశ్రయాల్లో బుధవారం 100కుపైగా సర్వీసులను రద్దు చేసినట్లు సమాచారం. అదేవిధంగా పదులకొద్ది విమానాలు ఆలస్యంగా నడిచాయి.

## కోర్టు ఆదేశాలతో భవానీపురంలో కూల్చివేత

### రోడ్డున పడ్డ 42 ఇళ్లకు చెందిన బాధితులు

**విజయవాడ, డిసెంబరు 3 :** భవానీపురంలోని జోజిపేటలో కోర్టు ఆదేశాల మేరకు 42 ఇళ్లను కూల్చివేశారు. శ్రీలక్ష్మి రామ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి అనుకూలంగా కోర్టు తీర్పు రావటంతో భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేత జరిగింది. కూల్చివేసిన ప్రాంతం చుట్టూ శ్రీలక్ష్మి రామ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ గోడ కడుతోంది. 42 ఇళ్ల కూల్చివేతతో బాధితులు రోడ్డున పడ్డారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. 25 ఏళ్లుగా నివాసముంటున్న తమను వెళ్లగొడుతున్నారని బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులతో వారంతా వాగ్వాదం చేశారు. సుప్రీంకోర్టు నుంచి స్టే ఆర్డర్ వచ్చినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితులు వాపోయారు. ఉదయం 10.45గంటలకు స్టే వచ్చిన విషయం పోలీసులు, న్యాయవాదుల దృష్టికి తీసుకెళ్లినా వినలేదని బాధితులు అంటున్నారు. సుప్రీంకోర్టు ఆర్డర్ వీడియో చూపించినా కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేసారు. డిసెంబర్ 31 వరకు ఎటువంటి కూల్చివేతలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నా లెక్క చేయకుండా ప్లాట్స్ కూల్చడంపై న్యాయపోరాటం చేస్తామని బాధితులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు.

## ఢిల్లీ మున్సిపల్ ఉప ఎన్నికల్లో బిజెపి సత్తా

- 12 స్థానాల్లో 7 గెలుపు.. ఆప్‌కు 3 సీట్లు
- కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్‌కు చెరో సీటు




**న్యూఢిల్లీ, డిసెంబరు 3 :** ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పైచేయి సాధించింది. 12 స్థానాల్లో 7 స్థానాలు గెలుచుకుంది. ఫిబ్రవరి అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన గెలుపును పదిలం చేసుకుంది. దశాబ్దానికి పైగా అధికారంలో కొనసాగి పది నెలల క్రితం అధికారాన్ని కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీ 3 సీట్లు గెలుచుకుని రెండో స్థానానికి పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ ఒక సీటును దక్కించుకోగా, మరో సీటును ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ గెలుచుకుంది. ఎంసీడీ ఉప ఎన్నికల్లో బీజేపీ ఏడు సీట్లు దక్కించుకున్నప్పటికీ మొత్తం 12 సీట్లలో ఇంతకుముందు 9 సీట్లు బీజేపీవే. ఇప్పుడు కోల్పోయిన రెండు సీట్లలో ఒక సీటు కాంగ్రెస్, మరొకటి ఏఐఎఫ్‌బీ చేజిక్కించుకున్నాయి. 2022లో జరిగిన పూర్తిస్థాయి ఎన్నికల్లో ఆప్ గెలుచుకున్న చాందినీచౌక్‌ను ఇప్పుడు బీజేపీకి చెందిన సుమన్ గుప్తా గెలుచుకోవడం ఆ పార్టీకి సానుకూల పరిణామం. 2022లో గెలుచుకున్న నరైన వార్డును తిరిగి ఆప్ నిలబెట్టుకుంది. బీజేపీ రెండు సీట్లు కోల్పోయినప్పటికీ ఎంసీడీలో ఆ పార్టీ ఆధిపత్యానికి ఢోకా లేదనే చెప్పాలి. మొత్తం 250 సీట్లలో బీజేపీకి ప్రస్తుతం 122 సీట్లు ఉండగా, ఆప్ 102 స్థానాలు కలిగి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత ఎంసీడీ ఉప ఎన్నికలు రావడంతో ముఖ్యమంత్రి రేఖాగుప్తాకు ఇది పరీక్షగా అందరూ భావించారు. అయితే ఆమె సునాయాసంగా పరీక్షలో నెగ్గారు. ఆప్ ఢిల్లీ యూనిట్ బాధ్యతలు తీసుకున్న సౌరభ్ భరద్వాజ్‌కు కూడా ఇది తొలి ఎన్నికలే అయినప్పటికీ ఆయన కూడా ఎలాంటి సీటు కోల్పోకుండా ఎన్నికలను గట్టెక్కించారని చెప్పవచ్చు. గ్రేటర్ కైలాశ్, షాలిమార్ బాగ్ బి, అశోక్ విహార్, చాందినీ చౌక్, చాందినీ మహల్, డిచావున్ కలాన్, నరైన, సంగమ్ విహార్ ఏ, దక్షిణ్ పురి, ముండ్కా, వినోద్ నగర్, ద్వారకా బి వార్డుల్లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. వార్డు కౌన్సిలర్లు అసెంబ్లీకి ఎన్నిక కావడంతో 11 వార్డులకు ఖాళీలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ సంగమ్ విహార్-ఏలో మాత్రమే గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి సురేష్ చౌదరికి 12,766 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థికి 3,628 ఓట్లు వచ్చాయి. చాందినీ మహల్ వార్డును ఎఐఎఫ్‌బీ అభ్యర్థి మహమ్మద్ ఇమ్రాన్ గెలుచుకున్నారు. దక్షిణపురి,ముండ్కా, నరైనా వార్డులను ఆప్ గెలుచుకుంది. తక్కిన ఏడు వార్డుల్లోనే బీజేపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు.

## రబీ యూరియా కోసం రైతుల క్యూ

**వరంగల్, డిసెంబర్ 3 :** మళ్లీ చూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. రబీకి ఎక్కడ దక్కదో అన్న ఆందోళనతో క్యూ కట్టారు. రబీ సీజన్లోనూ యూరియా కోసం రైతుల కు తిప్పలు తప్పడం లేదు. నల్లబెల్లిలోని వీఎఫ్‌జీ సొసై టీ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే సమా చారంతో బుధవారం వేకువజామునే రైతులు బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలతో కుమ్మక్కై ఎరువులు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. కృత్రిమ ఎరువు కొరత సృష్టిస్తు న్నారని వారు ఆక్షేపించారు. ఇలా అమ్ముతుండటంతో ప్రైవేట్ దుకాణాలలో కొనుగోలు చేయలేక పోతున్నామ ని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఎన్నికల సంస్కరణలపై చర్చించే దమ్ముందా?



**పార్లమెంట్ బృహత్తర బాధ్యతను నిర్వహించాల్సిన సమయం వచ్చింది. సమగ్ర ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. దీనిపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలి. అప్పడే ఎన్నికల సంస్కరణలపై చర్చకు అర్థం ఉంటుంది. రాజ్యాంగం గురించి గొప్పగా మాట్లాడుతున్న వారు అప్పడు రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘంపై విమర్శలు చేయకుండా చూడాలి. అలా చేస్తే శిక్షార్హులు అయ్యేలా చేయగలగాలి. సర్‌పై చర్చకు అనుమతించినందున పార్లమెంటులో ఈ అంశాలన్నీ చర్చించాలి.**

అనేకానేక అంశాలు చర్చ చేయాలి. దేశానికి గుదిబండగా మారిన గవర్నర్ వ్యవస్థ, మండలి వ్యవస్థ, ఒకే వ్యక్తి వరుసగా చట్టసభలకు ఎన్నికవ్వడం, డబుల్ పెన్షన్లు పొందడం వంటివన్నీ ఈ ఎన్నికల సంస్కరణలపై జరిగే చర్చలో భాగం కావాలి. అప్పుడే ప్రభుత్వ చిత్తశుద్ధి కూడా బయట పడు తుంది. అలాగే విపక్షాల నిజాయితీ కూడా ప్రజలకు తెలుస్తుంది. ఎన్నికల సంస్కరణలపై తూతూ మంత్రంగా చర్చించకుండా ఈ అంశాలను చర్చించాలి. విపక్షాల సూచనలనలు పరిగణించాలి. అంతా కలసి సమగ్ర ఎన్నికల విధానం రూపొందించాలి. అలాగే ఇటీవల పదవీ విరమణ చేస్తూ..సుప్రీం ప్రధాన న్యయామూర్తి బిఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను కూడా చర్చించాలి.ఎస్సీల్లో క్రిమిలేయర్ వర్తింప చేయాలన్న సూచనలు సభముందు చర్చించాలి. ఇకపోతే... ఇంతగా టెక్నాలజీ పెరిగినా..దానిని కేంద్ర ఎన్నికల సంఘం వినియోగించుకోవడం లేదేమో అని అనిపిస్తోంది. ఓటర్ల జాబితా మొదలు, ఓటరు నమోదు ప్రక్రియన సులువుగా చేయడం, లేని ఓట్లను తొలగించడం అన్నది సులువుగా జరగాలి. కానీ అలా జరగడం లేదనడానికి సర్ ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు రుజువు చేస్తున్నాయి. ఇటీవల ఉడాయ్ 2కోట్ల ఆధార్ కార్డులన నంబర్లను తొలగించింది. ఎక్కడా గందరగోళ రాలేదు. కాన ఓటు వషయంలో మాత్రం గందరగోళం ఏర్పడుతోంది. పక్కాగా ఓటు నమోదు, జాబితా రూపకల్పన, ఓటు అడ్రస్ మార్చుకోవడం అన్నది కంప్యూటర్ ముందు కూర్చుంటే అయిపోవాలి. నకిలీ ఓటు నమోదయితే కఠిన శిక్షలు అమలు కావాలి. మనదేశంలో తప్పులకు కఠిన శిక్షలు లేకపోవడం వల్లనే నేరాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం ఈ తరహాలో ఆలోచన చేయాలి.

ఓటును ఆధార్‌తో అనుసంధానం చేయడమే గాకుండా పక్కా ఓటరు కార్డు, జాబితాను రూపొందించాలి. సర్ లాంటి ప్రక్రియను ప్రతి ఎన్నికలకు ముందు జరపాలి. దొంగ ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను నిరంతరం తొలగించేలా వ్యవస్థను రూపొందించాలి. ఇకపోతే భారత ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్, దాని అమలు విధానం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి వివాదాలు రాకుండా పక్కాగా లక్ష్యాలను నిర్దేశించేలా పార్లమెంట్ చట్టాలను ఆమోదించాలి. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తోపాటు గుజరాత్‌లో సర్‌పై వివాదాలు రాకుండా చేయగలగాలి. ఇకపోతే బిఎల్ఓల మృతి వార్తలను దీనికి ఆపాదిస్తూ అసలు వ్యవస్థ పనిచేయకుండా చేయాలన్న మమతా బెనర్జీ లాంటి వారికి గట్టిగా సమాధానం చెప్పాలి. బీహార్‌లో ప్రారంభమైన ఎస్ఐఆర్ పక్రియ రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారించింది. ఇసి నుంచి వివరాలు తీసుకుంది. అయినా వివాదాలు సృష్టంచేందకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు సరికాదు. ఇది రాజ్యాంగ విధులను అడ్డుకోవడం తప్ప మరోటి కాదు. ఓటర్లు బూత్ లెవల్ అధికారుల ద్వారా అందజేయ బడిన ఎన్యూమరేషన్ ఫారాలను నింపి, తమ వివరాలను 2002-2005 నాటి ఓటర్ల జాబితాలతో సరిపోల్చాలి. 12 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశామని ఇసిఐ చెబుతున్నది. నిజమైన ఓటర్లు నింపాదిగా ఉండవచ్చు. వచ్చే నెలలో విడుదల కాబోయే ముసాయిదా జాబితాల్లో నమోదుకి అవసరమైన పత్రాలపై కూడా గందరగోళం లేకుండా చూడాలి. ఇంటింటికీ వెళ్లాలని చెప్పిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్తాయిలో బిఎల్‌వోలు పనిచేయాలి. పక్కాగా సమాచారం సేకరించాలి. ప్రతి ఓటరూ పాత రికార్డులు లేదా ఇసిఐ పేర్కొన్న పత్రాల ఆధారంగా తన చెల్లుబాటు నిరూపించాలి.

సవరించిన జాబితాల్లో తప్పుడు నమోదు సమస్యలను కూడా పరిశీలించడం ద్వారా ఎక్కడా ఎలాంటి అపోహలకు తావులేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. సార్వత్రిక వయోజన ఓటుహక్కును పరిరక్షించేందుకు, సాంకేతిక ఆధారిత డీ డూప్లికేషన్ తోపాటు, మరింత ఓర్పుతో ఇంటింటికీ వెళ్లి ధృవీకరణ చేసే పద్ధతిని ఇసిఐ ఎంచుకోవాలి. ప్రధానంగా టెక్నాలిజితీ నకిలీ ఓట్లకు చెక్ పెట్టవచ్చు. ఎఐ వినియోగం పెంచుకోవాలి. వయోజనులందరికీ ఓటుహక్కు పరిరక్షణ కంటే మరో ధర్మం ఉండరాదు. ఎన్నో సంవత్సరాలుగా ఓటర్ల జాబితాల్లో ఉన్న పౌరులు తమ అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి. ఖచ్చితమైన నమోదు బాధ్యతను కేంద్ర ఎన్నికల సంఘం పాటించాలి. అంతేగాక గందరగోళానికి దారితీసేలా చర్యలు ఉండరాదు. ఈ క్రమంలో కేంద్రం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఓటరు నమోదు అన్నది వ్యవస్థీకృతం కావాలి. పక్కాగా ఓటు నమోదు సాగాలి. ఎన్నికల సంస్కరణలపై చర్చలో ఇలాంటి అంశాలను అన్నింటినీ చర్చించాలి. విపక్షాల సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. దేశం అభివృద్ధి చెందాలంటే పక్కా ఓటు నమోదు వ్యవహారం ఉండాలి. లోటుపాట్లను చర్చించి సమగ్ర విధానంతో ముందుకు సాగేలా సవరణలకు వెనకాడరాదు.

# అడ్డూ అదుపులేని వెండి ధరలు

- వేలల్లో పెరుగుతూ బంగారానికి సవాల్
- రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిక



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** వెండిధరలు అదరగొడుతున్నాయి. బంగారంతో నాకేంటి పోటీ అన్నట్లుగా అమాంతంగా పెరుగుతున్నాయి. పెరగడమే తప్ప తగ్గడం లేదు. సరిగ్గా ఏడాది క్రితం వెండి ధర కిలో తొలిసారి లక్ష రూపాయలు దాటితే అంతా అబ్బో అనుకున్నారు. కానీ, ఇప్పుడు అదే వెండి పసిడికి ఏమాత్రం తక్కువ కానంటోంది. పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతోంది. దేశీయంగా కిలో వెండి రూ.1.84 లక్షల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. అటు పసిడి సైతం రూ.1.30 లక్షల పైనే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. వెండి అత్యధికంగా రూ.3,126 పెరిగి రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటింది. దీంతో దేశీయంగా వీటి ధరలు పెరిగాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,204 వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 57.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.83 లక్షలుగా ఉంది. గతంలో దేవుళ్ల బొమ్మలు, పూజా సామగ్రి, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులకు వెండిని దేశీయంగా వినియోగించేవారు. కొవిడ్ తర్వాత పరిస్థితులు మారాయి. పారిశ్రామికంగా వెండి వినియోగం పెరిగింది. సౌర విద్యుత్ రంగం, విద్యుత్ కార్లు, మొబైల్స్ తదితర రంగాల నుంచి దీనికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు చిన్న మదుపరులు పెట్టుబడి కోసం వెండిని కొనడం ప్రారంభించారు. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి బంగారంతో పాటు వెండికీ ఉందని చెబుతుండటంతో, మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు.

# హిందూ దేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

- గాంధీభవన్ ముట్టడికి బిజెపి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. స్వల్ప ఉద్రిక్తత

**హైదరాబాద్, డిసెంబర్ 3 :** నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని గాంధీభవన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ.. నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్-ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు.

# మూగ బాలుడిపై కుక్కల దాడి

## మెరుగైన వైద్యం అందించాలని రేవంత్ ఆదేశం

**హైదరాబాద్, డిసెంబర్ 3 :** హయత్‌నగర్‌లో మూగ బాలుడు ప్రేమ్ చంద్‌పై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాలుడి పరిస్థితిపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వారిని అదేశించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అతడికి అవసరమైన తక్షణ సాయం అందించాలని సూచించారు. స్వయంగా బాలుడిని పరామర్శించటంతో పాటు, ఆ కుటుంబాన్ని కూడా కలిసి.. వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వ పరంగా వారిని ఆదుకోవాలని కమిషనర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన సంఘటనలు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని. . తక్షణం వీధి కుక్కల దాడుల కట్టడికి చర్యలు చేపట్టాలని ఆయన అదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ షిర్డీ నగర్‌లో బి తిరుపతి, చంద్రకళ దంపతులు నివసిస్తున్నారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా తిరపతి పని చేస్తున్నాడు. అతడి భార్య చంద్రకళ కూలీ పని చేస్తుంది. వీరికి ప్రేమ్‌చంద్ (8) కుమారుడు ఉన్నాడు. అతడికి మాటల రావు. మంగళవారం ఉదయం ప్రేమ్ చంద్.. తన ఇంటి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్తున్నాడు. కుక్కల గుంపు అతడిపై మూకుమ్మడిగా దాడి చేశాయి. శీతాకాలం కావడంతో అతడు స్వెటర్ ధరించాడు. స్వెటర్‌ను నోటితో కరిచి అతడిని కొంత దూరం లాక్కెళ్లాయి. ప్రేమ్ చంద్ మూగవాడు కావడంతో కేకలు వేయలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి.. రాళ్లు విసిరి కుక్కలను తరిమికొట్టారు. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి.. 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. వాహనంలో అతడిని ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి మెరుగైన వైద్య చికిత్స కోసం నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి చెవకి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలుడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అతడి తల్లిదండ్రులు వెల్లడించారు. ఈ సంఘటనపై పత్రికలో వార్త కథనాలు వెలువడడంతో సీఎం రేవంత్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

# ఓయూలో విద్యార్థులకు పాడైన అన్నం

- విద్యార్థుల ఆందోళన కనువిప్పు కావాలి
- సిఎం రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, డిసెంబర్ 3 :** మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె అన్నట్లుగా రేవంత్ పాలన తీరు ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే,బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వేయి కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి గారు.. కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేకపోవడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం, గురుకులాల్లో పురుగుల అన్నం, ఇప్పుడు యూనివర్సిటీల్లో పాడైపోయిన భోజనం.. ఇదేనా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన ఘనత అని నిలదీశారు. అడుగడుగునా యూనివర్సిటీ పర్యవేక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డి గారూ.. మీ చేతగానితనంతో విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఆగం చేయకండి అని హరీశ్‌రావు హితవు పలికారు. ఇప్పటికైనా ప్రగల్భాలు మాని.. విద్యార్థులకు కడుపునిండా మంచి భోజనం పెట్టండని సూచించారు.

# రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

## ఖమ్మంలో ముగ్గురు.. మహబూబాబాద్‌లో ఒకరు మృతి

**ఖమ్మం, డిసెంబర్ 3 :** రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. ఖమ్మం ప్రమాదంలో ముగ్గురు, మహబూబాబాద్ జిల్లాలో ఒకరు మృతి చెందారు. ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సత్తుపల్లి మండలం కిష్టాపురం వద్ద అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.మృతులను సిద్దేశీజాయ్ (18), సాదిక్ (16), శశి (12)గా గుర్తించారు. చంద్రుగొండ నుంచి సత్తుపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇక మహబూబాబాద్ జిల్లాలో లారీని ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో జేఈఈగా పనిచేస్తున్న భగవత్ అనే వ్యక్తి లారీని వెనుక నుంచి ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.



గమనించిన స్థానికులు పోలీసులకు సమాచార మిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేపట్టారు.

# 13 మంది కుటుంసభ్యుల కాల్చివేత

- హంతకుడికి బహిరంగ మరణ శిక్ష
- బాలుడితో కాల్చి చంపించిన అఫ్ఘాన్ పోలీసులు

**కాబూల్, డిసెంబర్ 3 :** తాలిబాన్ పాలిత అఫ్ఘానిస్తాన్‌లోని కోస్ట్ ప్రాంతంలో ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఒక హంతకుడికి బహిరంగ శిక్ష అమలు చేయడంలో షాకింగ్ పనిచేశారు ఆఫ్ఘాన్ పోలీసులు. ఒకే ఫ్యామిలీకి చెందిన 13 మందిని దారుణంగా హత్య చేసిన నిందితుడు మంగల్‌ను, 13 ఏళ్ల బాలుడు చేత కాల్చి చంపించారు. శిక్షను స్థానిక స్పోర్ట్స్ స్టేడియంలో 80 వేల మంది ప్రజల ముందు అమలు చేశారు. అఫ్ఘాన్ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ 'ఖిసాస్' అంటే ప్రతీకార శిక్ష జరిగింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, మంగల్ 10 నెలల క్రితం అలీ షిర్ టెరెజియో జిల్లాల్లో నివశించే అబ్దుల్ రహ్మాన్.. అతని కుటుంబంలోని 12 మందిని తుపాకీతో కాల్చి చంపాడు. ఈ హత్యలకు అతనికి జీవిత ఖైదు శిక్ష పడింది. శిక్ష అమలు సమయంలో తాలిబాన్ అధికారులు కుటుంబంలో బతికున్న బాలుడు అబ్దుల్ రహ్మాన్ మంగల్‌కు క్షమాభిక్ష పెడతావా అని అడిగారు.. కానీ బాలుడు నిరాకరించడంతో, అతనికి తుపాకీ ఇచ్చి మంగల్‌పై మూడు రౌండ్ల కాల్పులు జరిపించారు. ఈ సందర్భంగా స్టేడియం భిడ్డు 'అల్లాహు అక్బర్' నినాదాలతో దద్ధరిల్లింది. కోస్ట్ పోలీస్ ప్రతినిధి ఈ ఘటనను ధృవీకరించారు. తాలిబాన్ పాలితంలో షరియా చట్టం కింద ఇలాంటి బహిరంగ శిక్షలు పెరుగుతున్నాయి. అయితే, అంతర్జాతీయ సమాజం ఈ శిక్షను 'అమానవీయ-ంమైనది, అత్యంత క్రూరమైనది' అని ఖండిస్తోంది.



# ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారయత్నం

**వరంగల్, డిసెంబర్ 3 :** వరంగల్ జిల్లా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువకుడు ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో వేల్పుల కమల్ అనే యువకుడు కిరాణా షాప్ నిర్వహిస్తుంటాడు. ఈ నెల రెండవ తేదీ రాత్రి కిరాణా దుకాణంలో సరుకులు కొనేందుకు వెళ్లిన 8 ఏళ్ల బాలికను లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో దుకాణానికి వేరే వారు రావడంతో పాప బయటికి పరిగెత్తుకుంటూ వెళ్లి వచ్చి విషయం తల్లిదండ్రులకు తెలిపింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో బాంబు కలకలం

## బాంబు సంచిని నోట కరిచిన కుక్క మృతి

**భద్రాద్రికొత్తగూడెం, డిసెంబర్ 3 :** కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో బాంబు పేలుడు కలకలం సృష్టించింది. గురువారం ఉదయం ఆగంతకుడు స్థానిక రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపై నల్ల సంచి ఉంచి వెళ్లిపోయాడు. అందులో ఏముందో ఎవరు పట్టించుకోలేదు. ఆ సంచిని వీధి కుక్క రైల్వే ట్రాక్‌పైకి నోటితో లాక్కెళ్లింది. ఆ సంచిలో ఉల్లిగడ్డ ఆకారంలో ఉన్న బాంబును కుక్క కొరింది. దీంతో భారీ శబ్దంతో బాంబు పేలుడు సంభవించింది. కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఈ బాంబు పేలుడుతో రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో.. కొత్తగూడెం 3వ పట్టణ పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంకా ఏమైనా బాంబులు ఉన్నాయా అంటూ పోలీస్ జాగిలాలతో రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో ఆగంతకుడు ఎటువైపు నుంచి వచ్చాడు. ఎటువెళ్లాడనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు.

## కలెక్టర్ సమక్షంలో జీపీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 3 :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ దివాకర టి.ఎస్. సాధారణ పరిశీలకుడు ఎన్నికలు ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆయిల్ ఫెడ్ హైదరాబాద్ సమక్షంలో బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్ వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 146 గ్రామ పంచాయతీల సర్పంచ్ 1290 వార్డులు స్థానాలకు 1306 పోలింగ్ స్టేషన్ ల లో ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఓ.పీ.ఓల ర్యాండమైజేషన్ జరిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు డీపీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 2028లో బీసీల ప్రభుత్వం రావడం తథ్యం

- బీసీల 42% రిజర్వేషన్లకు అగ్రకులాల కుట్ర
- టిఆర్పీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో 2028 వ సంవత్సరంలో బీసీల ప్రభుత్వం రావడం తధ్యమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ లో బుధవారం టిఆర్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 42% బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీలోని రెడ్డిలే బీసీలకు దక్కకుండా కుట్రలు పన్నారని ఆరోపించారు. ఏడు దశాబ్దాలుగా దేశంలో, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్ల తో గద్దెనెక్కి మోసం చేశారని విమర్శించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో బీసీలు నామినేషన్ వేయకుండా అగ్రకులాలు కుట్ర పన్నడం పిరికిపందల చర్య అని మండిపడ్డారు. ఇందుకు ఉదాహరణ నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లారెడ్డి గూడెం, నాగార్జునసాగర్,ఇలాంటి పరిస్థితి అనేక ప్రాంతాల్లో ఉత్పన్నమవుతుందని బహుజనులు పదవులను అనుభవించవద్దని ప్రశ్నించారు. బహుజనులు చైతన్యవంతులు కాకపోతే తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆక్షేపించారు. పోరాడితే పోయేదేం లేదు బానిసంకెళ్ల తప్ప అనే నినాదంతో బహుజనుల అంత ఏకమై రాజ్యాధికారం దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన జాతి బిడ్డల మనమే ఓట్లు వేసేలా ప్రజల్ని సంఘటిత పరిచి ఆ దిశగా కృషి చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా పేదలకు భూమి పంపిణీ, విద్యా, వైద్యం, మైనార్టీలకు న్యాయం చేసేలా టిఆర్పీ పార్టీ మేనిఫెస్టో ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టిఆర్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, చాంద్ పాషా, నరసయ్య, ఆవుల అంజయ్య, ఇందిర, రజిత, సూపర్ సైదులు, కుంభం నాగరాజు, బొల్లె సైదులు,బొమ్మగాని సైదులు గౌడ్, లింగస్వామి గౌడ్, వల్లాల సైదులు, లింగాల సైదులు, జానకి రాములు, లింగరాజు, మల్లయ్య యాదవ్, కోల కర్ణాకర్, బోడపట్ల మధు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో వాజేడు నాగారం ఐఈఆర్సి ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్ నందు బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి తేజవత్ వెంకటేశ్వరరావు హాజరై, మాట్లాడుతూ.. మాట్లాడుతూ విద్యార్థులందరినీ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలని, వారికి స్కాలర్షిప్, సదరన్ క్యాంపులు నిర్వహించే సమయంలో స్లాట్ లో బుక్ చేసుకొని సదరన్ సర్టిఫికెట్లను పొంది తగిన సందర్భాల్లో వినియోగించుకోవాలని సూచించారు. అలింకో కంపెనీ డిస్ట్రిక్ట్ లెవెల్ మెడికల్ క్యాంప్ నిర్వహించి,10 మంది దివ్యాంగుల విద్యార్థులను గుర్తించి వారికీ పరికరాలు ఇచ్చుటకు నిర్ధారించడం జరిగిందని,ఇతర సేవలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. జరిగింది. విద్యార్థులందరికీ ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోజ్, ఉపాధ్యాయులు శిరీష, గని,ఐఈఆర్సి దుర్గానంద్, స్పెషల్ ఎడ్యుకేటర్ లక్ష్మి, తల్లితండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.





## మీ బిడ్డగా నన్ను ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా

- పదవి కోసం కాదు ప్రజల కోసం పనిచేస్తా
- సర్పంచ్ అభ్యర్థి అనిత రంగయ్య గౌడ్

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం బీజేపీ బలపర్చిన పారుపల్లి సర్పంచ్ అభ్యర్థి లాగ్గని అనిత రంగయ్య గడపగడప తిరుగుతూ ప్రచారం చేశారు. అధికారం కాదు అభివృద్ధి ముఖ్యం అని ఓటర్లతో మమేకమై ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాగ్గాని రమేష్ గౌడ్,బూడిద రాములు, పోటీ చేసే వార్డు మెంబర్లు1వ వార్డు సుజాత, 2వ వార్డు బొద్దు సాగర్,3 వార్డు పోలేపాక జ్యోతి,4వ వార్డు, దయ్యాల రేణుక,5వ వార్డు కావ్య,6వ వార్డు బద్దీపడిగే హరీష్ రెడ్డి,7వ వార్డు బయ్యని సురేష్,8వ వార్డు వత్తూరి వీర సోమయ్య,సోమరాజ్, కిషన్ రెడ్డి, లక్ష్మినారాయణ, రాంరెడ్డి, మహేష్,కిష్టయ్య,కుమార్, చంద్రయ్య,కృష్ణమూర్తి,సురేష్,నర్సయ్య, ఐలయ్య, వీరస్వామి, మల్లారెడ్డి, మహేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## బచ్చోడు పంచాయతీ పీఠం కాంగ్రెస్ పార్టీదే

### సర్పంచ్ అభ్యర్థి నందిపాటి మల్లేష్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని తిరుమలాయ-పాలెం మండలంలోని బచ్చోడు గ్రామ పంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి నందిపాటి మల్లేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకి ప్రజలు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల అమలు,ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కల్యాణ లక్ష్మి,వరి మద్దతు ధర, బోనస్, రుణమాఫీ, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు. గ్రామంలోని 10 వార్డులతో కలిపి మొత్తం 1844 మంది ఓటర్లు ఉన్నారని,ప్రతి వార్డులో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. సర్పంచ్ గా గెలిచిన వెంటనే గ్రామంలో త్రాగు నీటి సౌకర్యం,సీసీ రోడ్లు,సైడ్ డ్రెయినేజీ,అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడుతానని, వీధి దీపాలు ఏర్పాటు చేసి గ్రామాన్ని స్వచ్ఛ పరిశుభ్రతగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం అరవింద్ రెడ్డి,మాజీ సర్పంచ్ హరిత రెడ్డి ఆశీస్సులతో సర్పంచ్ గా గెలవడం ఖాయమని మల్లేష్ స్పష్టం చేశారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే బాధ్యత నాది

### కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి నాగుల సత్యనారాయణ

**ఆత్మకూర్ (ఎం )రాజ ముద్ర న్యూస్:** కాంగ్రెస్ పార్టీ ఆలేరు శాసన సభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సారధ్యంతో పోతిరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నాగుల సత్యనారాయణ గ్రామంలో గడపగడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. తనకు రాబోయే గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి నన్ను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని మాట ఇస్తూ గ్రామంలో ప్రతి సమస్యలకు ముందుండి తమ వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాగుల ఆనంద్ వార్డు మెంబర్ల అభ్యర్థులు ఇంద్రల రేణుక సురేష్ యానగాని నర్సింహా ఇంద్రాల అంజయ్య ఎడమ మోహన్ రెడ్డి మెట్టు లలిత ముక్తల ఐలయ్య ఎల్లబోయిన రమేష్ జక్కు మల్లారెడ్డి నాగుల రమేష్ నాగుల జనార్దన్ యావగాని బిక్షం అమంద్ చారి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పెంపు ఉత్తర్వులపై స్టే పొడిగింపు

**హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన ఉత్తర్వులపై స్టేను హైకోర్టు బుధవారం మరోసారి పొడిగించింది. తదుప రి ఉత్తర్వులు జారీచేసే దాకా జీవో 9, 41, 42ల అమలును నిలిపివేస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని పేర్కొంది. 4 వారాల్లో కౌంట ర్లు దాఖలు చేయాలని ప్రభు త్వాన్ని ఆదేశిస్తూ, అనంతరం రెండు వారాల్లో రిప్లయ్ కౌంట ర్లు దాఖలు చేయాలని పిటిషన ర్లను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. స్థానిక సంస్థ ల్లో బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లి మండలానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితో పాటు మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లతోపాటు ఇందు లో తమనూ ప్రతివాదులుగా చేర్చి తమ వాదనలూ వినాలం టూ పలువురు కాంగ్రెస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియ-ుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచార ణ చేపట్టింది. కౌంటరు దాఖ లు చేయడానికి గడువు కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవా ది కోరడంతో ధర్మాసనం అనుమతిస్తూ విచారణను వాయిదా వేసింది.



## పల్లెపహాడ్ గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తా

### సర్పంచ్ అభ్యర్థి సూగురు స్రవంతి హరిబాబు

**ఆత్మకూర్ (ఎం )రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలో పల్లెపహాడ్ గ్రామ సిపిఐ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సూగురు స్రవంతి హరిబాబు గెలిపించాలని. గడప గడపకు తిరిగి ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ నన్ను గెలిపిస్తే పల్లెపహాడ్ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శిథిలావస్థలో ఉన్న శివాలయం పున నిర్మాణం ఆత్మకూరు నుండి పల్లెపహాడ్ వరకు డబుల్ రోడ్డు గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి సీసీ రోడ్లు నూతన స్ట్రీట్ లైట్స్ పెద్ద వాగు పై చెక్ డ్యాం పల్లెపహాడ్ నుండి మైసమ్మ గుండ్ల వరకు బీటి రోడ్డు పల్లెపహాడ్ నుండి తేర్యాల కు వయా హరిచంద్రు బాయి నుండి బీటి రోడ్డు ఏర్పాటుతొలి విడతలో ఇప్పటికే 25 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఐ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్రవంతి హరిబాబును సర్పంచ్‌గా గెలిపించండి

### పల్లెపహాడ్ అభివృద్ధిలో భాగస్వాములు అవండి

#### ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య

**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్ :** ఆత్మకూరు( ఎం). మండలంలోని పల్లెపహాడ్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి శ్రీమతి శ్రీ సుబ్బూరు స్రవంతి హరిబాబు గారికి పల్లెపహాడ్ గ్రామ పంచాయతీ ఓటర్లు తమ అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు శ్రీ బీర్ల అయిలయ్య గారు కోరారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పల్లెపహాడ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి శ్రీమతి శ్రీ సుబ్బూరు స్రవంతి హరిబాబు గార్లను ఆశీర్వదించి గెలిపిస్తే వారు ఇచ్చిన విజ్ఞప్తి మేరకు మన పల్లెపహాడ్ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శిథిలావస్థలో ఉన్న శివాలయం పునఃర్ నిర్మాణం, ఆత్మకూరు నుండి పల్లెపహాడ్ వరకు డబుల్ రోడ్డు, గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి, సీసీ రోడ్లు, నూతన స్ట్రీట్ లైట్స్, పెద్ద వాగు పై చెక్ డ్యాం, పల్లెపహాడ్ నుండి మైసమ్మ గుండ్ల వరకు బీటి రోడ్డు, పల్లెపహాడ్ నుండి తేర్యాల కు వయా హరిచంద్రు బాయి నుండి బీటి రోడ్డు ఏర్పాటు , తొలి విడతలో ఇప్పటికే 25 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి కాగా రానున

## పైనంపల్లి సర్పంచ్ గా విజయకేతనం ఎగరవేస్తా

- కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిని వాంకుడోత్ అమ్మి
- ప్రజల ఆదరణతో జోరుగా సాగుతున్న ప్రచారం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తిరుమలాయపాలెం మండలంలోని పైనంపల్లి గ్రామ ప్రజలు ఆదరించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని సర్పంచ్ అభ్యర్థిని వాంకుడోత్ అమ్మి అన్నారు. ఇటీవల సర్పంచ్ అభ్యర్థినిగా పార్టీ శ్రేణులు,మద్దతుదారులతో కలిసి నామినేషన్ వేసిన అనంతరం గ్రామంలో ప్రచార కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలైన ఆరు గ్యారంటీల అమలు,ఉచిత విద్యుత్,సన్నబియ్యం,వరి మద్దతు ధర, బోనస్, రుణమాఫీ, మహిళలకి వడ్డీలేని రుణాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని చెప్పారు. తన భర్త వాంకుడోత్ జామ్లా గతంలో ఉప సర్పంచ్ గా పనిచేసిన అనుభవం,గ్రామ ప్రజలతో తనకున్న సన్నిహిత సంబంధాలతో గెలుపు సునాయాసమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందు కు కృషి చేస్తానని తెలియజేశారు. పైనంపల్లి గ్రామంతో పాటుగా హాల్ తండా,వాంకుడోత్ తండాలో త్రాగు నీటి సౌకర్యం,సీసీ రోడ్లు,సైడ్ డ్రెయినేజీ,అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడుతానని, వీధి దీపాలు ఏర్పాటు చేసి గ్రామాన్ని స్వచ్ఛ పరిశుభ్రతగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు. గ్రామంలోని 8 వార్డులతో కలిపి మొత్తం 1029 మంది ఓటర్లు ఉన్నారని,ప్రతి వార్డులో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి ఆశీస్సులు,ప్రజల ఆదరణతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయ కేతనం ఎగరవేస్తానని ధీమా వ్యక్తం చేశారు.



## రహీంఖాన్ పేట సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

### సర్పంచ్ అభ్యర్థి సుధాగాని కళావతి లింగయ్య

**ఆత్మకూరు (ఎం ).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలంలోని రహీంఖాన్ పేట గ్రామంలో బీఆర్ఎస్ బీజేపీ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సుధాగాని కళావతి లింగయ్య ఇంటి ఇంటికి తిరిగి ఓటర్లను తనకు రాబోయే గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అన్నారు. గెలిపిస్తే రహీంఖాన్ పేట గ్రామాన్ని అభివృద్ధి చేస్తా అని పలు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బచ్చోడు తండా పంచాయతీలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

### కాంగ్రెస్ నాయకులు గుగులోత్ రవి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీదే ఘన విజయమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుగులోత్ రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడుతండా గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న గుగులోత్ కళావతికి తండా వాసులు సంపూర్ణ మద్దతును అందిస్తున్నారని తెలిపారు. గతంలో ఐదేళ్ల పాటుగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ గా పనిచేసిన కళావతి బచ్చోడు తండాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని గుర్తు చేశారు. గ్రామంలో సీసీ రోడ్లు,సైడ్ డ్రెయినేజీ,అంతర్గత రహదారులు,మంచినీటి ట్యాంకు,పాఠశాల నిర్మాణం చేపట్టి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దారని చెప్పారు. అదే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమాభివృద్ధి పథకాలు అమలుతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలు,ఉచిత విద్యుత్, సన్నబియ్యం, వరి మద్దతు ధర, బోనస్, రుణమాఫీ, మహిళలకు వడ్డీ రేట్లు రుణాలు వంటి పథకాలు అమలు చేసి పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని చెప్పారు. దీనికి తోడు పాలేరు నియోజకవ ర్గంలో మంత్రి పొంగులేటి చేపట్టిన అభివృద్ధి, పిఎస్ఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారని తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలకి డిపాజిట్ కూడా దక్కదని,ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎత్తున పట్టం కట్టనున్నారని వెల్లడించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి ఆశీస్సులతో సర్పంచ్ గా పనిచేసిన అనుభవం కలిగిన కళావతి గెలుపు నల్లేరు పై నడకేనని ధీమా వ్యక్తం చేశారు.




## కూరెళ్ల మమత రమేష్‌ను ఆశీర్వదించండి

**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండలం కూరెళ్ళ గ్రామ ప్రజలు తనను ఆదరించి సర్పంచిగా గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు మండల పరిధిలో కూరెళ్ల గ్రామం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కురెళ్ళ మమత రమేష్ గడపగడపకు తిరుగుతూ కత్తెర గుర్తుకు. మీ అమూల్యమైన ఓటు వేయాలని మన గ్రామం ఎన్నో అభివృద్ధి పనులు చేయించుకోవాలని మనస్ఫూర్తిగా నా గ్రామ ప్రజలను తెలియచేయుచున్నాను అభివృద్ధి లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నాను ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పద్మ పాపయ్య ,సిపిఐ మండల నాయకులు వెంకటేష్ ,చంద్రయ్య, రమేష్ ,కాంగ్రెస్ సిపిఐ బలపరిచిన కూరెళ్ళ మమత రమేష్ ,లింగయ్య, సాయి, ఉప్పల నరసయ్య ,సహదేవ్, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భారత్‌తో యుద్ధానికి
# ఆసిమ్ మునీర్ తహతహ
### ఇమ్రాన్‌ఖాన్ సోదరి



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సోదరి అలీమా ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో యుద్ధం కోసం పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తహతహలాడుతున్నారని పేర్కొన్నారు. అయితే, తన సోదరుడు మాత్రం పొరుగుదేశంతో స్నేహపూర్వక సంబంధాల కోసం ప్రయత్నాలు చేశారన్నారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అలీమా ఈ వ్యాఖ్యలు చేశారు. మునీర్‌ను ఇస్లామిక్ ఛాందస వాదిగా అభివర్ణించారు. ఇమ్రాన్ స్వేచ్ఛావాది అని అన్నారు. ఈ సందర్భంగా మేలో భారత్- పాక్ మధ్య యుద్ధానికి గల కారణం గురించి ప్రశ్న ఎదురవగా.. ఆమె మునీర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఆసిమ్ మునీర్ ఇస్లామిక్ ఛాందసవాది. అందుకే అతడు భారత్‌తో యుద్ధం కోసం ఆరాటపడుతున్నాడు. ఇమ్రాన్‌ఖాన్ పొరుగుదేశంతో స్నేహపూర్వక సంబంధాలకు ప్రయత్నాలు చేశారు. సందర్భం వచ్చినప్పుడల్లా మునీర్ భారత్‌తో ఘర్షణలకు దిగుతాడు. ఇది భారత్‌తో పాటు దాని మిత్ర దేశాలకు కూడా నష్టమే' అని అన్నారు. మాజీ ప్రధాని జైల్లోనే మృతి చెందారంటూ పెద్దఎత్తున ప్రచారం జరిగిన నేపథ్యంలో ఆయన మరో సోదరి ఉజ్మా ఖానుమ్ ఇమ్రాన్‌ను మంగళవారం కలిసిన సంగతి తెలిసిందే. సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇమ్రాన్ జైల్లో సురక్షితంగానే ఉన్నారని, అయితే మానసికంగా వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. తాను జైలు శిక్ష అనుభవించడానికి ఆసిమ్ మునీర్ కారణమని ఇమ్రాన్ తనతో చెప్పాడని ఉజ్మా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పాక్ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. పాక్ ప్రజలను అణచివేసేందుకు వాళ్లు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఇందులో ఒక నేపాలీతో సహా 26 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టింది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. ఈ క్రమంలో కొన్ని రోజుల పాటు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగాయి. అనంతరం ఇరుదేశాలు కాల్పుల విరమణను ప్రకటించాయి.

## అమెరికాలో ఆంధ్రా మహిళ హత్య కేసు
### సమాచారం ఇస్తే 50వేల డాలర్లు : ఎఫ్‌బీఐ

**యూఎస్ :** అమెరికాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శశికళ నర్రా 2017లో తన కుమారుడితో సహా దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఓ కీలక ప్రకటన చేసింది. నిందితుడు హమీద్ ఆచూకీ తెలిపిన వారికి 50వేల డాలర్ల రివార్డు ఇస్తామని పేర్కొంది. ఈ కేసులో నజీర్ హమీద్‌ను నిందితుడిగా అధికారులు తేల్చారు. హత్యలు జరిగిన ఆరు నెలల అనంతరం నిందితుడు భారత్‌కు పరారైనట్లు అమెరికా అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అతడు అక్కడే ఉన్నాడని తెలిపారు. హమీద్ అరెస్టుకు సంబంధించి వారెంట్‌ను జారీ చేసినట్లు ఎఫ్‌బీఐ తెలిపింది. దీంతోపాటు అతడి సమాచారం అందించిన వారికి 50వేల డాలర్లు రివార్డు అందిస్తామని ప్రకటించింది. ఈ హత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని అధికారులు వివరించారు. ఇక, హత్య కేసుపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో బాధితరాలి భర్త హనుమంతరావు కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు బర్లింగ్టన్ కౌంటీ ప్రాసిక్యూటర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.




## తత్కాల్‌లో మరో మార్పు..
### కౌంటర్ బుకింగ్స్‌కూ ఓటీపీ

**న్యూఢిల్లీ :** తత్కాల్ టికెట్లకు సంబంధించి రైల్వే శాఖ మరో మార్పునకు సిద్ధమవుతోంది. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద ఇకపై తీసుకునే తత్కాల్ టికెట్లకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ ని తప్పనిసరి చేయనుంది. తత్కాల్ టికెట్ బుకింగ్‌లో అక్రమాలను అరికట్టడంలో భాగంగా ఈ నిబంధనను అమలు చేయనుంది. రిజర్వేషన్ కౌంటర్ల వద్ద నవంబర్ 17 నుంచి ఓటీపీ ఆధారిత తత్కాల్ టికెట్ బుకింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. తొలుత కొన్ని ట్రైన్లతో మొదలుపెట్టి.. తర్వాత 52 ట్రైన్లకు విస్తరించింది. రాబోయే కొద్ది రోజుల్లో ఈ విధానాన్ని అన్ని రిజర్వేషన్ కార్యాలయాలకు విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రైల్వే శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అంటే ఇకపై కౌంటర్ వద్ద రిజర్వేషన్ ఫారమ్ నింపిన తర్వాత బుకింగ్ సమయంలో మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేస్తేనే టికెట్ బుక్ అవుతుందన్నమాట. రైల్వే టికెట్ల విషయంలో ఇటీవల రైల్వేమంత్రిత్వ శాఖ పలు మార్పులు చేపట్టింది. అక్రమాలకు తావులేకుండా అసలైన ప్రయాణికులకు మేలు చేకూర్చేందుకు ఈ మార్పులు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా జులై నుంచి ఆన్‌లైన్ తత్కాల్ టికెట్ బుకింగ్‌కు ఆధార్ ఓటీపీ వెరిఫికేషన్‌ను తప్పనిసరి చేసింది. అక్టోబర్ నుంచి సాధారణ రిజర్వేషన్ టికెట్లకు సైతం తొలి 15 నిమిషాల బుకింగ్‌కు ఆధార్ అథంటికేషన్ ఉన్న యూజర్లకు మాత్రమే అవకాశం కల్పిస్తోంది.

## వలసలపై ఆంక్షలు..
# ఆ దేశాలకే నష్టం
### విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** అమెరికా, ఐరోపా దేశాల్లో వలసల ఆంక్షలపై విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వలసలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే.. వాటి సొంత ప్రయోజనాలే దెబ్బతినే అవకాశం ఉందన్నారు. చివరకు ఆ దేశాలే నష్టపోతాయని హెచ్చరించారు. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈమేరకు మాట్లాడారు. చాలా సందర్భాల్లో వాళ్లే ఈ సమస్యను సృష్టించారని, కాబట్టి స్వయంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. "నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలకు, ఈ సంక్షోభానికి ఎటువంటి సంబంధం లేదు. వలసలకు సంబంధించి అమెరికా, ఐరోపా దేశాల్లో ఏమైనా ఆందోళనలు ఉంటే.. అవి ఆ దేశాలు అమలు చేసిన దీర్ఘకాలిక విధానాల ఫలితమే. గత రెండు దశాబ్దాల్లో ఉద్దేశపూర్వకంగా, అన్ని తెలిసే తమ వ్యాపారాలను విదేశాలకు విస్తరించాయి. ఇది వారి వ్యూహం. కాబట్టి.. ఈ సమస్యలకు స్వయంగా పరిష్కార మార్గాలు కనుగొనాలి. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలనేవి ఇరుపక్షాలకు ప్రయోజనమని పాశ్చాత్య దేశాలు గుర్తించాలి. ఒకవేళ పెద్దఎత్తున ఆంక్షలు విధిస్తే ఆ దేశాలే నష్టపోతాయి. ప్రపంచం అధునాతన తయారీ రంగం వైపు మళ్లుతున్న కొద్దీ.. నైపుణ్యం కలిగిన ప్రతిభ అవసరం పెరుగుతుంది. ఏ దేశం కూడా స్వయంగా సరిపడా సంఖ్యలో నిపుణులను వేగంగా తయారు చేయలేదు" అని జైశంకర్ పేర్కొన్నారు. ఈ ఒత్తిళ్లను సమతుల్యం చేసుకునేందుకు పాశ్చాత్య దేశాలు చివరకు ఓ మార్గాన్ని కనుగొంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## సంచార్ సాథీ యాప్
# తప్పనిసరేం కాదు : కేంద్రం




**దిల్లీ:** కొత్తగా వచ్చే సెల్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరేం కాదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు టెలికాం విభాగం బుధవారం ప్రకటించింది. సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం కొత్తగా వచ్చే సెల్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసే చర్యని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఎవరితో సంప్రదించకుండా నియంతృత్వంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల తర్వాత స్వచ్ఛందంగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారి సంఖ్య పదింతలు పెరిగింది. తమ లక్ష్యం కూడా ఇదేనని కేంద్రం తాజా ప్రకటనలో అభిప్రాయపడింది. "సంచార్ సాథీ యాప్ యూజర్లు వేగంగా పెరుగుతున్నారు. తప్పనిసరి చేయడం వెనక ఉద్దేశం కూడా ఇదే. తద్వారా దీని గురించి తెలియని వాళ్లకు అవగాహన కల్పించాలి అనుకున్నాం. గడిచిన ఒక్కరోజులో ఆరు లక్షల మంది యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. ఇది దాదాపు పదింతల పెరుగుదల. సంచార్ సాథీకి ఆదరణ పెరిగిన నేపథ్యంలో ముందస్తు ఇన్‌స్టలేషన్‌ను తప్పనిసరి చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించింది" అని టెలికాం విభాగం తమ ప్రకటనలో పేర్కొంది.

# డాలర్‌కు 12 లక్షల రియాల్స్..
### ఇరాన్ కరెన్సీ దారుణ పతనం




**ఇరాన్ :** పశ్చిమాసియా దేశం ఇరాన్ ఆర్థికంగా అతలాకుతలం అవుతోంది. డాలర్ విలువతో పోలిస్తే ఇరాన్ కరెన్సీ రికార్డు స్థాయిలో 12 లక్షల రియాల్స్‌కు పతనమైంది. అణు ఆంక్షల ఎఫెక్ట్ ఆ దేశంపై తీవ్రంగా పడింది. అవి ఆర్థిక వ్యవస్థను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రియాల్ కుదేలు అవుతుండటంతో ప్రజల రోజూవారీ జీవితం అస్తవ్యస్తమవుతోంది. మాంసం, బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఒకవైపు ధరల మోత.. ఇజ్రాయెల్, అమెరికాతో ఉద్రిక్తతల గురించి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అమెరి కా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరాన్‌పై ఆంక్షలతో విరుచుపడ్డారు. ఇరాన్‌తో ముడిచమురు వ్యాపారం చేస్తోన్న సంస్థలపై ఆంక్షలు విధించారు. అందులో చైనాకు డిస్కౌంట్‌కు విక్రయిస్తోన్న చమురు సంస్థలు కూడా ఉన్నాయి. ఈ సెప్టెంబర్‌లో ఐరాస ఇరాన్‌పై అణు ఆంక్షలను పునరుద్ధరించింది. దాంతో విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులు స్తంభించిపోయాయి. ఆయుధ ఒప్పందాలు నిలిచిపోయాయి. ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్‌లో ఏదైనా పురోగతి ఉంటే కఠిన చర్యలు ఎదర్కోవాల్సి ఉంటుంది. ఇక ఇరాన్‌కు ఇంటా పలు సమస్యలు ఉన్నాయి. అవినీతి, అసమర్థ నిర్వహణ వంటివి వేధిస్తున్నాయి. పవర్ గ్రిడ్‌ల వైఫల్యంతో దేశంలో గంటలపాటు బ్లాకవుట్‌లను చవిచూస్తోంది. ఇరాన్‌లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్న నేపథ్యంలో ఇంధన సంక్షోభం వెంటాడుతోంది. భారీ స్థాయిలో సహజవాయువు, ముడి చమురు నిక్షేపాలు ఉన్నప్పటికీ.. వాతావరణ పరిస్థితుల కు అనుగుణంగా ఇంధన రంగాన్ని సిద్ధం చేయలేకపోతోందనే వాదన ఉంది. దీంతో కీలక సమయాల్లో ఇంధన కొరత ఏర్ప డుతున్నట్లు సమాచారం. అణ్వాస్త్ర కార్యక్రమాల కారణంగా అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లుగా పతనావస్థలో ఉంది. 2015లో అగ్రరాజ్యంతో ఇరాన్ అణు ఒప్పందం చేసుకునే నాటికి ఒక డాలర్‌కు 32వేల రియాల్స్ ఉండేవి. 2018లో ట్రంప్ ఆ ఒప్పందం నుంచి బయటకువచ్చారు. మళ్లీ ఒప్పందం కోసం చర్చలు మొదలుపెట్టినప్పటికీ.. అవి ప్రస్తుతం నిలిచిపోయాయి. దాంతో కొంతకాలంగా భారీగా పతనమవుతూ వస్తోన్న రియాల్ విలువ.. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల నాటికి 7.03లక్షలకు చేరుకుంది. ఆ పతనం కొనసాగుతూనే ఉంది.

## ఆ 32వేల మంది ప్రైమరీ టీచర్ల
# నియామకాలు చెల్లుతాయ్..



**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసుతో ముడిపడి ఉన్న 32వేల ప్రైమరీ టీచర్ల నియామకాలు రద్దు చేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. తొమ్మిదేళ్లుగా సర్వీసులో ఉన్న వారిని ఇప్పుడు తొలగిస్తే.. వారి కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడొచ్చని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సింగిల్ బెంచ్ రద్దు చేసిన.. ఆ 32వేలమంది ప్రైమరీ టీచర్ల నియామకాలు చెల్లుతాయని పేర్కొంది. 32వేల ప్రైమరీ టీచర్ల నియామకాల విషయంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్లు బెంగాల్ విద్యా మంత్రి బ్రత్య బసు పేర్కొన్నారు. 32వేల మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఉద్యోగాలు పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని పేర్కొంటూ.. టీచర్లకు, ప్రాథమిక విద్యా మండలికి శుభాకాంక్షలు తెలిపారు.




## పౌర అణు సహకార ఒప్పందంపై సంతకాలు చేయనున్న భారత్-రష్యా

**మాస్కో:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఇరుదేశాల సంబంధాలలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. భారత్‌తో పౌర అణు సహకార ఒప్పందానికి రష్యా చట్టసభ డ్యూమా ఆమోదం తెలిపింది. పుతిన్ పర్యటనలో భాగంగా భారత్-రష్యా పౌర అణు సహకార ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్లు తెలుస్తోంది. గత ఫిబ్రవరిలో కుదుర్చుకున్న రవాణాలో పరస్పర మార్పిడి సహకారానికి డ్యూమా ఇప్పటికే ఆమోదం తెలిపింది. వాణిజ్యం, రక్షణ, ఇతర రంగాల్లోనూ పలు ఒప్పందాలకు పుతిన్-మోదీ శ్రీకారం చుట్టనున్నారు. ఎస్-400 క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన ఒప్పందం విషయంలోనూ ఇరుదేశాలు సంతకం చేయనున్నట్లు తెలుస్తోంది. భారత్‌తో రష్యా సంబంధాలు వ్యూహాత్మకమైనవి, సమగ్రమైనవి, వాటిని విలువైనవిగా భావిస్తున్నట్లు డ్యూమా స్పీకర్ వ్యాచెస్లావ్ పేర్కొన్నారు. భారత్‌తో చేసుకున్న రెలోస్ ఒప్పందంలో భాగంగా రెండు దేశాల మధ్య సైనిక నిర్మాణాలు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాల పరస్పర మార్పిడి ఉంటుందని.. ఇరు దేశాల మధ్య సంయుక్త సైనిక విన్యాసాలు, శిక్షణ, మానవతా సాయం, ప్రకృతి విపత్తుల సమయంలో మానవతా సాయం, రెండు దేశాల గగనతలాన్ని, పోర్టులను రష్యా, భారత్ యుద్ధ నౌకలు వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇరుదేశాల మధ్య సైనిక సహకారాన్ని బలోపేతం చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### భారత్‌తో సహకారం పెంపొందించుకోవడమే లక్ష్యం: పుతిన్

భారత్‌తో సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకోవడానికి రష్యా ఎదురుచూస్తోందని ఆ దేశాధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఇంధనం, పరిశ్రమ, అంతరిక్షం, వ్యవసాయం, ఇతర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశం పైనా ప్రధాని మోదీతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకునే చమురు పరిమాణం తాత్కాలికంగా తగ్గినప్పటికీ మాస్కో ఆ దేశానికి కీలక ఇంధన సరఫరాదారుగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

## ఆటోపెన్‌తో నాడు బైడెన్ చేసిన
# సంతకాలు చెల్లవు : ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తన పదవీకాలంలో ఆటోపెన్ ఉపయోగించి సంతకాలు చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులు ఏవీ చెల్లవని ప్రకటించారు. అవి నిరుపయోగం అన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పోస్టు పెట్టారు. 'జో బైడెన్ పదవీకాలంలో ఆటోపెన్ ఉపయోగించి సంతకం చేసిన పత్రాలు, ఒప్పందాలు, ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు, మెమోరాండమ్స్ అన్నీ నిరుపయోగం. అవి చెల్లవు. క్షమాభిక్షలు, రవాణా చెల్లింపులతో సహా అతడు సంతకం చేసిన పత్రాలు ఎవరైనా పొంది ఉంటే.. వాటికి చట్టపరంగా ఎలాంటి విలువ లేదు' అని ట్రంప్ తేల్చి చెప్పేశారు. ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి బైడెన్ ఆటోపెన్‌పై పలు ఆరోపణలు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో వైట్‌హౌస్‌ను వీడే ముందు బైడెన్ జారీచేసిన అనేక క్షమాభిక్షలు కూడా చెల్లవని గతంలో ప్రకటించారు. ఈ క్రమంలో బైడెన్ ఆరోగ్యం పైనా పలు విమర్శలు చేశారు. కాగా.. ఇటీవల బైడెన్ సంతకాలు చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సంతకాల విషయంలో అధ్యక్షుడి అనుమతి తీసుకొని ఆటోపెన్ వాడాల్సి ఉంటుంది. అయితే, బైడెన్‌కు తెలియకుండా ఆయన సిబ్బంది ఆ ఆటోపెన్‌ను ఉపయోగించారని ట్రంప్ ఆరోపిస్తున్నారు.

## భారత్‌పై బంగ్లా ఆర్మీ మాజీ జనరల్ తీవ్ర వ్యాఖ్యలు




**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గతేడాది ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి, భారత్‌లో ఆశ్రయం పొందుతున్నప్పటి నుంచి ఇరుదేశాల బంధాలు బలహీనపడుతున్న విషయం తెలిసిందే. నాటి నుంచి ఆ దేశ నాయకులు భారత్‌పై తమ అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారు. తాజాగా బంగ్లాదేశ్ ఆర్మీ మాజీ జనరల్ అబ్దుల్లాహిల్ అమాన్ ఆజ్మీ ఓ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..భారత్ ముక్కలు అవ్వనంత వరకు బంగ్లాదేశ్‌లో శాంతి నెలకొనదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అబ్దుల్లాహిల్ అమాన్ ఆజ్మీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో భారత నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బంగ్లా విముక్తికి భారత్ చేసిన సహాయాన్ని మరిచి..ఆ దేశ నాయకులు భారత్‌పై విషం కక్కుతుండడం సిగ్గుచేటని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాత్కాలిక ప్రభుత్వంతో బంధాలు తిరిగి పునరుద్ధరించుకోవడానికి భారత్ ప్రయత్నిస్తున్న క్రమంలో బంగ్లాదేశ్ ఆర్మీ మాజీ జనరల్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలో బంగ్లాలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అనంతరం అక్కడున్న హిందూ మైనార్టీలపై దాడులు జరిగాయి. దీనిపై భారత్ ఎప్పటికప్పుడు తన ఆందోళనను వ్యక్తంచేస్తోంది. ఈ క్రమంలోనే ఇరుదేశాల మధ్య బంధాలు బీటలు వారాయి. అయితే, భారత్- బంగ్లాల మధ్య సత్సంబంధాలను కొనసాగించాలని భావిస్తున్నట్లు ఇరుదేశాలు పేర్కొంటూ వస్తున్నాయి.

# క్రెడిట్ కార్డు యూజర్లూ.. జాగ్రత్త



క్రెడిట్ కార్డు వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ మోసగాళ్లు దోపిడీకి పాల్పడుతున్నారు. 'క్రెడిట్ కార్డు వ్యాలిడిటీ అయిపోయింది, రివార్డు పాయింట్ల సమయం మించిపోతోంది, క్రెడిట్ కార్డుల నగదు లిమిట్ పెంచుతాం..' అంటూ మోసాలకు పాల్పడుతున్నారు. కాల్ చేసి నమ్మిస్తూ సున్నితమైన అంశాలను సేకరించి ఖాతాలను ఖాళీ చేసేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు క్రెడిట్‌కార్డు వినియోగదారులకు కీలక సూచనలు చేశారు. కస్టమర్ కేర్, బ్యాంకు సిబ్బంది ఎప్పుడూ మిమ్మల్ని ఓటీపీ, యూపీఐ పిన్ వంటివి అడగరని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహన ఉన్నా.. కొంచెం ఏమరుపాటు, నిర్లక్ష్యమే డబ్బులు కోల్పోయేందుకు కారణమంటున్నారు పోలీసులు. "క్రెడిట్ కార్డు లిమిట్ పెంపు పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. కస్టమర్ కేర్ పేరిట కాల్ చేస్తూ లిమిట్ పెంపు కోసం యాప్ డౌన్‌లోడ్ చేయిస్తారు. ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండండి. మీ కార్డు, ఖాతా వివరాలను సేకరిస్తుంటారు. అందువల్ల మీ క్రెడిట్ కార్డు వివరాలు ఎవరికీ చెప్పొద్దు. కస్టమర్ కేర్, బ్యాంకు సిబ్బంది అయినా సరే ఓటీపీ మాత్రం చెప్పొద్దు. ఎవరికైనా అనుమానం వస్తే తక్షణమే 1930కు ఫిర్యాదు చేయండి" అని పోలీసులు సూచించారు.






## నాలుగో రోజూ నష్టాలే..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి ఫ్లాట్‌గా ముగిశాయి. ఆర్‌బీఐ ఎంపీసీ వేళ మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ నెల 5న ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై ప్రకటన చేయనుంది. దీంతో వరుసగా నాలుగోరోజూ సూచీలకు నష్టాలు తప్పలేదు. ఆఖర్లో కాస్త కొనుగోళ్ల మద్దతు కనిపించినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ 26వేల మార్కు దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 85,150.64 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,138.27) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,763.64 – 85,269.68 మధ్య ఓ మోస్తరు శ్రేణిలోనే కదలాడింది. చివరికి 31.46 పాయింట్ల నష్టంతో 85,106.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 46.20 పాయింట్ల నష్టంతో 25,986 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.21గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63.21 డాలర్లు, బంగారం ఔన్సు 4202 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# టార్గెట్ సరిపోలేదు..

## ఉత్కంఠ పోరులో సఫారీలదే విజయం

## విరాట్, రుతురాజ్ సెంచరీలు వృథా



**రాయ్‌పుర్:** భారత్‌తో జరిగిన రెండో వన్డేలో సౌతాఫ్రికా 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 359 పరుగుల టార్గెట్‌ని సఫారీలు 49.2 ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయి ఛేదించారు. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమం అయింది. సౌతాఫ్రికా ఓపెనర్ ఐదెన్ మార్‌క్రమ్ (110, 98 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతకం బాదాడు. మాథ్యూ బ్రిట్జ్కే (68, 64 బంతుల్లో 5 ఫోర్లు), డెవాల్డ్ బ్రెవిస్ (54, 34 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో మెరిశారు. తెంబా బావుమా (46, 48 బంతుల్లో) రాణించాడు. టోని డి జోర్జి (17, రిటైర్డ్ హర్ట్), కోర్బిన్ బాష్ (26), కేశవ్ మహరాజ్ (10) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ శనివారం (డిసెంబర్ 6న) విశాఖపట్నంలో జరగనుంది.

### విరాట్, రుతురాజ్ సెంచరీలు..

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (105, 83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), విరాట్ కోహ్లీ (102, 93 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకాలతో చెలరేగారు. గైక్వాడ్‌కు వన్డేల్లో ఇది తొలి శతకం కావడం విశేషం. చివర్లో కేఎల్ రాహుల్ (66, 43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (22), రోహిత్ శర్మ (14) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. రవీంద్ర జడేజా (24లి) పరుగులు చేశాడు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ 2, నంద్రీ బర్గర్, లుంగి ఎంగిడి ఒక్కో వికెట్ పడగొట్టారు.





## రూపాయి ఢమాల్..

### తొలిసారి 90 మార్క్ దాటి..

అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ దారుణంగా పతనమైంది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే ఏకంగా 90 మార్క్‌ను దాటి సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. క్రితం సెషన్‌లో 89.96 వద్ద ముగిసిన రూపాయి విలువ.. నేటి ఆరంభం నుంచే క్షీణిస్తూ వస్తోంది. ఒక దశలో ఏకంగా 90.14 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం ఉదయం 10 గంటల ప్రాంతంలో 90.12 వద్ద ట్రేడ్ అవుతోంది. దిగుమతిదార్ల నుంచి డాలరుకు అధిక గిరాకీ, షార్ట్‌కవరింగ్ కొనసాగడం లాంటివి రూపాయి క్షీణతకు కారణమయ్యాయి. భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై సందిగ్ధత, విదేశీ సంస్థాగత మదుపర్ల లాభాల స్వీకరణ వంటివి కూడా రూపాయి విలువను బలహీనపరుస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలాగే కొనసాగితే.. రూపాయి విలువ 91కి పడిపోవచ్చని అంచనా వేస్తున్నాయి. మరోవైపు దేశీయ మార్కెట్లు కూడా బుధవారం నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ 241 పాయింట్లు దిగజారి 84,897 వద్ద, నిఫ్టీ 103 పాయింట్ల నష్టంతో 25,928 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఇదిలా ఉండగా.. నేటి నుంచి ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేటి నుంచి ప్రారంభం కానుంది. డిసెంబరు 5న వడ్డీ రేట్లపై కేంద్ర బ్యాంకు ప్రకటన చేయనుంది. కీలక వడ్డీరేట్లపై ఆర్‌బీఐ కోత పెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.



## రూపాయి పతనంపై ప్రభుత్వం ఆందోళన చెందడం లేదు : సీఈఏ

**ఢిల్లీ:** డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. తొలిసారి 90 మార్కు దాటింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి అనంత నాగేశ్వరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి విలువ 90 రూపాయల మార్కు దాటడం పట్ల ప్రభుత్వం ఆందోళనేమీ చెందడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల అటు ద్రవ్యోల్బణంపై గానీ, ఎగుమతులపై గానీ ప్రభావం ఉండబోదని చెప్పారు. వచ్చే ఏడాది పరిస్థితి మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సీఐఐ ఈవెంట్‌లో భాగంగా ఆయన మాట్లాడారు. రూపాయి విలువ బుధవారం ఇంట్రాడేలో 90.30 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మంగళవారం ముగింపుతో పోలిస్తే 34 శాతం మేర క్షీణించింది. ఎఫ్ఐఐల అమ్మకాలు, డాలర్‌కు కొనుగోళ్ల మద్దతు వంటివి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో క్షీణత, భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం విషయంలో ఇప్పటికీ ఒక స్పష్టత రాకపోవడమూ కారణమని ఫారెక్స్ ట్రేడర్లు చెబుతున్నారు. రూపాయి విలువ పతనం విషయంలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి.



## దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్..

### భారత జట్టు ఇదే

భారత్, సౌతాఫ్రికా మధ్య డిసెంబరు 9 నుంచి ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్ కోసం భారత సెలక్టర్లు జట్టును ప్రకటించారు. ఈ సిరీస్‌తో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పునరాగమనం చేయనున్నాడు. రింకు సింగ్‌పై వేటుపడింది. సఫారీలతో టెస్టు సిరీస్‌లో మెడ నొప్పితో మైదానాన్ని వీడిన శుభ్‌మన్ గిల్‌ను టీ20 సిరీస్‌కు ఎంపిక చేశారు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇస్తే గిల్ మ్యాచ్‌లు ఆడతాడు.

**భారత జట్టు:** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, సంజు శాంసన్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

ఐదు టీ20ల సిరీస్ షెడ్యూల్
తొలి టీ20 - డిసెంబర్ 9 (కటక్)
రెండో టీ20 - డిసెంబర్ 11 (ముల్లాన్‌పూర్)
మూడో టీ20 - డిసెంబర్ 14 (ధర్మశాల)
నాలుగో టీ20 - డిసెంబర్ 17 (లఖ్‌నవూ)
ఐదో టీ20 - డిసెంబర్ 19 (అహ్మదాబాద్)

## వారిద్దరూ వరల్డ్‌కప్ 2027 ఆడకుంటే

# మాకు సంతోషమే : గుర్బాజ్



రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ.. వన్డే వరల్డ్ కప్ 2027 ఆడకుం టే తమకు సంతోషమే అని అఫ్గానిస్థాన్ వికెట్ కీపర్ రహ్మను ల్లా గుర్బాజ్ అన్నాడు. నిజానికి రో-కో లాంటి లెజెండ్స్ వరల్డ్‌కప్‌లో భాగం కాకుంటే బాగోదని తన అభిప్రాయం వెల్లడించాడు. రోహిత్, కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వారు కేవలం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. వన్డే వరల్డ్‌కప్ 2027లో పాల్గొనడమే ధ్యేయంగా ముందుకుసాగుతున్నారు. అయితే వారి భవిష్యత్తుపై ప్రస్తుతం ఊహాగానాలు నడుస్తున్నాయి. వీరిద్దరూ ఆస్ట్రేలియా టూర్‌లో రాణించారు. అలాగే దక్షిణాఫ్రికాతో రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలోనూ సత్తా చాటారు. కోహ్లీ భారీ సెంచరీ (135), రోహిత్ అద్భుత హాఫ్ సెంచరీ (57) సాధించారు. అలాగే రెండో వికెట్‌కు వీరు 136 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. 'ఒక అఫ్గానిస్థాన్ ఆటగాడిగా.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భారత జట్టులో లేకుంటే నేను ఆనందపడతా. వారు టీమ్‌ఇండియాలో ఉంటే.. ఆ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి. వారిద్దరూ లెజెండ్స్. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జట్టులో లేరు అని ఎవరూ చెప్పలేరు. నిజానికి వారు జట్టులో లేకుంటే.. ప్రత్యర్థి జట్లు చాలా సంతోషపడతాయి' అని రహ్మనుల్లా గుర్బాజ్ అన్నాడు. 'నేను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు విరాట్ భాయ్‌ను సాయం అడిగేవాన్ని. గత మూడు సంవత్సరాలుగా ఎప్పుడు నేను కాల్ చేసినా, మెసేజ్ చేసినా అతడు వెంటనే స్పందిస్తున్నాడు. ఇటీవలే నేను పరుగులు సాధించలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు అతన్ని సంప్రదించా. ఆ తర్వాతి మ్యాచ్‌లో నేను 90 పరుగులు స్కోర్ చేశా. కోహ్లీ చాలా సింపుల్ వ్యక్తి. అతడు దేన్నీ క్లిష్టంగా మార్చడు. అతడు హార్డ్‌వర్క్ చేస్తాడు. అదే సమయంలో పనిని ఆస్వాదిస్తాడు. క్రికెట్‌లో అదే అవసరం. ఆటను ఆస్వాదించలేనప్పుడు మెరు గైన ప్రదర్శనలు చేయలేం' అని గుర్బాజ్ పేర్కొన్నాడు.



## ప్రియాంక చోప్రాకు కల్కిలో ఆఫర్?

ప్రపంచవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు- ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈవెంట్‌లో ప్రియాంక తన లుక్‌తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్‌లో నటించిన దీపికా పదుకొణెలి పలు కారణాల వలన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్.సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ప్రియాంక ఇందులో నటించనుందని వస్తున్న వార్తలలో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది. 2000లో మిస్ వరల్డ్‌గా కిరీటాన్ని గెలుచుకున్న ప్రియాంక, తర్వాత హిందీ చిత్రాల్లో వరుస విజయాలు సాధించారు. ఫ్యాషన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్‌లో క్వాంటికో, బేవాచ్, సిటాడెల్ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించారు. రామ్ చరణ్‌తో కలిసి ఆమె నటించిన జంజీర్ రీమేక్‌తో టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ చిత్రం తెలుగులో తుఫాన్‌గా విడుదలైంది.

## సమంతకు నిడుమోరు గృహంలోకి ఆహ్వానం

### ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న రాజ్ సోదరి శీతల్

అగ్ర కథానాయిక సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డిసెంబర్ 2న సమంతకు అత్త వారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. ఈ మేరకు రాజ్ సోదరి శీతల్ ఈ జంటకు విషెస్ చెబుతూ ఒక ఎమోషనల్ నోట్ పంచుకున్నారు. నిడిమోరు ఫ్యామిలీలోకి సమంతను ఆహ్వానిస్తూ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటానని అన్నారు. ప్రస్తుతం ఈ ఫ్యామిలీ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఆనందంతో మాటలు రావడం లేదు. గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో ఈరోజు నేను అలా ఉన్నాను. ఆనందబాష్పాలతో నా హృదయం ఉప్పొంగుతోంది. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది. సమంత- రాజ్ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. ఒకరిపై ఒకరికి గౌరవం, నిజాయతీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతో నిండిపోతుంది. మేము వీరికి ఎప్పుడూ అండగా ఉంటాము' అని రాసుకొచ్చారు. ఈషా ఫౌండేషన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.






## దురంధర్ మూవీపై సద్దుమణిగిన వివాదం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా రాబోతున్న తాజా చిత్రం 'ధురంధర్' పై తలెత్తిన వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సినిమా కథకు, అమరుడైన మేజర్ మోహిత్ శర్మ జీవితానికి ఎటువంటి సంబంధం లేదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ స్పష్టం చేసింది. మేజర్ మోహిత్ శర్మ జీవిత చరిత్ర ఆధారంగా తమ అనుమతి లేకుండా ఈ సినిమాను తెరకెక్కించారంటూ ఆయన తల్లిదండ్రులు కొద్ది రోజుల క్రితం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. మీడియాతో పాటు, సోషల్ మీడియాలోనూ ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ జీవితాధారంగానే తెరకెక్కిందన్న చర్చ జరిగిందని, దీనిపై చిత్ర బృందం తమను సంప్రదించడం గానీ, స్పందించడం గానీ చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కారణంగా, సినిమాను తమకు ప్రత్యేకంగా చూపించాలని, అప్పటివరకు విడుదలను నిలిపివేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. దీంతో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ సినిమాను పునః పరిశీలించింది. పునః పరిశీలన అనంతరం 'ధురంధర్' చిత్రం కేవలం ఒక కాల్పనిక కథ అని, ఇది మేజర్ మోహిత్ శర్మ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించబడలేదని కోర్టుకు నివేదించింది. దీంతో ఈ సినిమాపై ఉన్న వివాదం తాత్కాలికంగా సద్దుమణిగినట్లు అయింది.

# 2025లో పాపులర్ నటీనటులు వీళ్లే

ముంబయి: ఈ ఏడాది దక్షిణాదితో పాటు, బాలీవుడ్ ప్రేక్షకులను అలరించారు కథానాయికలు రష్మిక మందన్నా, రుక్మిణి వసంత్. తాజాగా మరో అరుదైన ఘనతను సాధించారు. సినిమాలు, టీవీ షోలు, సెలబ్రిటీలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని విశ్లేషించి అందించే వేదిక ఐఎండీబీ. 2025 సంవత్సరానికి గానూ అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సినీ నటులు, దర్శకుల జాబితాను తాజాగా ప్రకటించింది. ఇందులో టాప్-10లో రష్మిక, రుక్మిణి వసంత్‌లతో పాటు, కల్యాణి ప్రియదర్శన్‌లకు చోటు దక్కింది. ఇక మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ డ్రామా 'సయారా'లో నటించిన అహాన్ పాండే, అనీత్ పడ్డా ఈ జాబితాలో టాప్‌లో నిలిచారు. కేవలం ఒకే ఒక్క సినిమా వీళ్లకు ఎంతో పేరు తెచ్చిపెట్టింది. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన మోహిత్ సూరి ఈ ఏడాది అత్యంత ప్రజాదరణ కలిగిన దర్శకుడిగా నిలిచారు. కేవలం రూ.45 కోట్లతో నిర్మించిన 'సయారా' బాక్సాఫీస్ వద్ద రూ.570 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టడం విశేషం. ఇక దర్శకుల జాబితాలో మోహిత్ సూరి తర్వాత ఆర్యన్ ఖాన్ (ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్), లోకేశ్ కనగరాజ్ (కూలీ) తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఐఎండీబీ పాఠకుల అభిరుచుల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు.





### రష్మికకు 'విజయ' నామ సంవత్సరం..

ఇక ఈ ఏడాది రష్మికకు 'విజయ' నామ సంవత్సరంగా అభివర్ణించవచ్చు. 2025లో ఆమె 'ఛావా', 'సికిందర్', 'థామా', 'కుబేర', 'గర్ల్‌ఫ్రెండ్ 'చిత్రాల్లో నటించి మెప్పించారు. 'సికిందర్' మినహా మిగిలినవన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నాయి. రుక్మిణి వసంత్ 'ఏస్', 'మదరాసి', 'కాంతార: చాప్టర్1'తో పలకరించగా, 'కాంతార1' ఆమె నటనలో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది.



### ఐఎండీబీ 2025 అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటులు

- అహాన్ పాండే (సయారా)
- అనీత్ పడ్డా (సయారా)
- ఆమిర్ ఖాన్ (సితారే జమీన్ పర్)
- ఇషాన్ ఖట్టర్ (హెూం బౌండ్)
- లక్ష్య (ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్)
- రష్మిక మందన్నా (ఛావా, సికిందర్, థామా, కుబేర)
- కల్యాణి ప్రియదర్శన్ (లోక:చాప్టర్1)
- త్రిప్తి డిమ్రి (ధడక్2)
- రుక్మిణి వసంత్ (కాంతార: చాప్టర్1)
- రిషబ్ శెట్టి (కాంతార: చాప్టర్1)
- అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ దర్శకులు
- మోహిత్ సూరి (సయారా)
- ఆర్యన్ ఖాన్ (ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్)
- లోకేశ్ కనగరాజ్ (కూలీ)
- అనురాగ్ కశ్యప్ (నిశాంచి, బందర్)
- పృథ్వీరాజ్ సుకుమారన్ (ఎల్2: ఎంపురాన్)
- ఆర్.ఎస్. ప్రసన్న (సితారే జమీన్ పర్)
- అనురాగ్ బసు (మెట్రో ఇన్ దినో)
- డోమినిక్ అరుణ్ (లోక:చాప్టర్1)
- లక్ష్మణ్ ఉటేకర్ (ఛావా)
- నీరజ్ ఘేవాన్ (హెూం బౌండ్)

# వర్కింగ్ అవర్స్‌తో సినిమా నడవదు

### ఔట్‌పుట్ రావాలంటే.. సమిష్టిగా పనిచేయాల్సిందే
### తాజాగా నటులు రానా, దుల్కర్ సల్మాన్ వ్యాఖ్యలు

బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణెలి ఇటీవల వర్కింగ్ అవర్స్‌పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. రోజుకు ఎనిమిది గంటల పని చాలు..అతిగా వర్క్ చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు అని ఆమె చెప్పిన మాటలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యాఖ్యల కారణంగా ఆమెను 'స్పిరిట్', 'కల్కి 2' ప్రాజెక్టుల నుంచి తప్పించేశారని వచ్చిన వార్తలు మరింత వివాదాన్ని రేకెత్తించాయి. జీవితం-పని మధ్య బ్యాలెన్స్ చాలా అవసరం అని దీపిక చెప్పిన మాటలకి పలువురు సెలబ్రిటీలు ఆమెకు మద్దతు తెలిపారు. మనసు, శరీరం ఒత్తిడిలో ఉన్నప్పుడు మంచి అవుట్‌పుట్ సాధ్యం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ వివాదంపై నటుడు దగ్గుబాటి రానా తాజాగా స్పందించారు. సినిమా ఇండస్ట్రీ సాధారణ ఉద్యోగం కాదు. నటన ఒక లైఫ్‌స్టైల్. ఎనిమిది గంటలు కూర్చొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చే ఫీల్డ్ ఇది కాదని రానా వెల్లడించారు. ఒక మంచి సీన్ రావాలంటే కెమెరా నుంచి లైటింగ్ వరకు, నటీనటులు నుంచి టెక్నీషియన్ల వరకూ అందరూ సమయం పట్టించుకోకుండా అంకితభావంతో పని చేస్తారని ఆయన అన్నారు. ఇక్కడ 8 గంటల రూల్ ప్రాక్టికల్‌గా చాలా కష్టం అని స్పష్టం చేశారు. నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ఈ విషయంపై తన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమలలో వర్క్ మోడల్ ఒక్కో రకంగా ఉంటుంది. తెలుగులో మహానటి చేస్తున్నప్పుడు కొన్నిసార్లు సాయంత్రం ఆరు గంటలకే షూటింగ్ అయిపోయేది. తమిళంలో పరిస్థితి కొంచెం వేరుగా



ఉంటుంది. ఆదివారాలు కూడా సెలవు ఇస్తారు. ఒక రోజు అతిగా పనిచేయడం కంటే, రోజూ కొంచెం అదనంగా పనిచేయడం బెస్ట్ అని దుల్కర్ స్పష్టం చేశారు. ఇండస్ట్రీ ధోరణి, ప్రాజెక్ట్ డిమాండ్స్ మీద వర్కింగ్ అవర్స్ ఆధారపడి ఉంటాయి అని ఆయన స్పష్టం చేశారు. మలయాళంలో షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియదు.. ఇక తమిళంలో ఈ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఒక రోజు అదనపు షూటింగ్ కంటే.. రోజూ కొన్ని గంటలు అదనంగా పనిచేయడం సులువే కదా' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీపికా పదుకొణెలి వ్యాఖ్యలపై రానా,దుల్కర్ స్పందించడంతో సినీ పరిశ్రమలో వర్కింగ్ అవర్స్‌పై చర్చ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది.

# ఐటమ్ సాంగ్‌లతో పూజ అదుర్స్

### అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు ప్రచారం

తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్రనటులతో నటించటం ఆమె కెరీర్‌కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ప్లాప్‌ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్‌గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది. 'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్‌కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్‌కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్‌లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలకంటే స్పెషల్ సాంగ్‌లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్‌లతో తన మార్కెట్‌ను తిరిగి పదిలం చేసుకుంటున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com